జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




కృష్ణ మంగళవారం 7 జూలై 2026 సంపుటి : 01 సంచిక :174 పేజీలు : 12 వెల : 3/- PRGI No. APTEL/26/A0119,

శ్రీ పరాభవ నామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం సూర్యోదయం: 5:31 ၊ సూర్యాస్తమయం: 6:33 చంద్రోదయం: 11:42 ၊ చంద్రాస్తమయం: 11:30 తిథి: బహుళ సప్తమి ఉ. 8:43 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తరాభాద్ర మ. 12:44 వరకు, తదుపరి రేవతి, యోగం: శోభ ఉ. 11:49 వరకు, తదుపరి అతిగండ, కరణం: బవ ఉ. 8:43 వరకు, తదుపరి బాలవ రా. 8:05 వరకు, తదుపరి కౌలవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# గిరిజన ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు

- మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లు: సీఎం చంద్రబాబు
- నెలలోగా అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలి
- మూడు నెలల్లో యూఎల్‌బీల్లో చెత్త తొలగిస్తాం
- రియల్‌టైమ్ గవర్నెన్స్ నుంచి వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష



**అమరావతి**

ప్రజా సమస్యలు, ఇబ్బందులపై ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే స్పందించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలన్నారు. విశాఖ సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏపీ విభాగాలు ఎలా - మిగతా3లో



## 'ఉగ్రం' రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా

- హైదరాబాదీ స్టార్టప్ ఘనత
- ఆర్మీ, హోం శాఖ కీలక పరీక్షలను పూర్తిచేసిన 'ఉగ్రం' రైఫిల్
- హైదరాబాద్‌కు చెందిన 'ద్విప డిఫెన్స్, డీఆర్‌డీఓ సంయుక్తంగా అభివృద్ధి
- సీఆర్పీఎఫ్, ఐటీబీపీ వంటి కేంద్ర బలగాల్లోకి ప్రవేశానికి మార్గం సుగమం
- ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో దేశీయంగా తయారీ

# మడ అడవులతో తీరానికి రక్షణ



- 250 హెక్టార్లలో విస్తరణకు ప్రణాళికలు
- తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచంగా నిలిచే మడ అడవుల విస్తీర్ణం పెంచేందుకు అటవీశాఖ చర్యలు
- కేంద్ర, రాష్ట్ర నిధులతో ప్రత్యేక కార్యాచరణ

**అమరావతి**

తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచంగా నిలిచే మడ అడవుల విస్తీర్ణం పెంచేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. జీవవైవిధ్య పరిరక్షణలో కీలకపాత్ర పోషించే ఈ అడవులను పెంచి పోషించేందుకు కేంద్ర, రాష్ట్ర నిధులతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. బాపట్ల జిల్లా సూర్యలంక పొగురు సమీపంలోని 100 హెక్టార్లలో మడ మొక్కలను నాటి సంరక్షిస్తున్నారు. సూర్యలంకతో పాటు పెదగంజాం - మిగతా3లో

# ఆలయానికి కొత్తగా సీఈఓ



- చందా చోరీ ఉదంతంతో మసకబారిన అయోధ్య రామమందిర ప్రతిష్టను పునరుద్ధరించేందుకు చర్య
- ముగ్గురు సభ్యుల కమిటీకి సీఈఓ ఎంపిక బాధ్యతలు
- చంపత్ రాయ్ రాజీనామా ఆమోదం
- తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా కృష్ణ మోహన్ నియామకం
- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీలో నిర్ణయాలు

# చర్చల యుద్ధానికి సిద్ధం

- కీలక బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- రాజ్యాంగ సవరణ బిల్లు
- వీగిపోవడంతో ఈసారి ముందస్తు వ్యూహంతో బరిలోకి బీజేపీ
- ప్రజాసమస్యలపై నిలదీసేందుకు సిద్ధమవుతున్న విపక్షాలు



## ఏపీని భారతదేశ ఏఐ రాజధానిగా

# నిలపడమే లక్ష్యం



- దక్షిణకొరియా రెండో రోజు పర్యటనలో బిజీబిజీగా లోకేశ్
- పలు సంస్థల ప్రతినిధులతో వరుస సమావేశాలు
- పెట్టుబడులకు ఏపీలో ఉన్న అవకాశాలను వివరించిన లోకేశ్
- సాధ్యమైనంత త్వరగా శ్రీసిటీ యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం
- భారత్‌లోని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఏపీలో మైక్రో ఎల్ఈడీ డిస్ ప్లే-మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలి

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం ప్రభుత్వ ధ్యేయమని మంత్రి లోకేశ్ తెలిపారు. రెండోరోజు పర్యటనలో భాగంగా దక్షిణకొరియాలోని సియోల్‌లో పలు సంస్థల ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఏపీలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. ఏపీని ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేయాలని కొరియన్ సంస్థలకు ఆహ్వానం పలికారు. ప్రభుత్వ ప్రతిపాదనలపై కొరియన్ కంపెనీలు అత్యంత సానుకూలత వ్యక్తం చేస్తూ ఏపీలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాయి. దక్షిణకొరియాలో రెండోరోజు పర్యటనలో మంత్రి లోకేశ్ పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలతో బిజీబిజీగా గడిపారు. దక్షిణకొరియాకు చెందిన - మిగతా3లో



## పక్కనే ఉన్న ఆంధ్రాను చూసి కర్ణాటక చాలా నేర్చుకోవాలి

- కేంద్రమంత్రి కుమారస్వామి
- కర్ణాటక సర్కార్‌పై కేంద్ర మంత్రి కుమారస్వామి విమర్శలు
- అభివృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను చూసి నేర్చుకోవాలని హితవు
- రాజకీయాలకు అతీతంగా ఏపీ నేతలు ఏకమవుతారని ప్రశంస
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్యాకేజీ, అనకాపల్లి ప్రాజెక్టును ప్రస్తావించిన కుమారస్వామి
- కర్ణాటకలో మైనింగ్ కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వమే అడ్డంకి అని ఆరోపణ

# రాష్ట్ర ప్రభుత్వం బంపరాఫర్



- ఆ దంపతులకు రూ. 5 వేల చొప్పున నగదు పురస్కారం
- ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారాలు
- కాన్పు, కాన్పుకు మధ్య 2 ఏళ్లు ఎడమ పాటించిన దంపతులకూ నగదు పురస్కారాలు

**అమరావతి**

కాన్పుల మధ్య తగిన విరామం పాటించడం, అవాంఛిత గర్భధారణలను నివారించడం, కుటుంబ నియంత్రణ సేవలను రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టనుంది. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జులై 11 నుంచి 18వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గురు అంతకంటే ఎక్కువ మంది పిల్లలు కలిగిన దంపతులకు నగదు పురస్కారాన్ని అందచేయనున్నామని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రతి జిల్లాలో మూడు జంటలకు రూ.5 వేల చొప్పున నగదును అందచేస్తామన్నారు. కాన్పు, కాన్పుకు మధ్య కనీసం రెండేళ్లపాటు ఎడమ పాటించిన దంపతులకు - మిగతా3లో

# ఆలయానికి కొత్తగా సీఈఓ

అయోధ్య: రామమందిర ఉద్యమాన్ని ముందుండి నడిపించిన బీజేపీ, సంఘ్ పరివార్‌లు అయోధ్య రామమందిరంలో కోట్ల రూపాయల చందా చోరీ ఉదంతంతో మసకబారిన ఆలయ ప్రతిష్ట పునరుద్ధరించేందుకు నడుంబిగించాయి. ఆలయ నిర్వహణ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించేలా కొత్తగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈఓ) పదవిని ఏర్పాటుచేయాలని సోమవారం జరిగిన శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కీలక భేటీలో నిర్ణయించారు. సీఈఓ పదవికి అర్హతలున్న వ్యక్తి ఎంపిక బాధ్యతలను ముగ్గురు సభ్యుల కమిటీకి అప్పగించారు. ఈ కమిటీలోకి సభ్యులుగా విశ్రాంత న్యాయమూర్తి ప్రమోద్ కోహ్లీ, విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ విష్ణుకాంత్ చతుర్వేది, ట్రస్టీ సురేశ్ హవారేలను తీసుకున్నారు. లక్షలాది మంది భక్తులు సమరి?పంచిన నగదు, స్వర్ణాభరణ కానుకలను కాజేసిన ఉదంతంలో నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామాచేస్తూ చంపత్ రాయ్ తీసుకున్న నిర్ణయాన్ని సోమవారం ఆలయ కాంప్లెక్స్‌లోని గెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్నం మూడుగంటలపాటు జరిగిన భేటీలో ట్రస్ట్ సభ్యులు ఆమోదించారు. ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా రాజీనామానూ ఆమోదించారు. ప్రస్తుతం ట్రస్టీగా ఉన్న కృష్ణమోహన్‌ను తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ సమావేశంలో సభ్యులు నిర్ణయం తీసుకు న్నారు.



**ఎవరైనా వచ్చి సరిచూసుకోవచ్చు: కృష్ణమోహన్**

భేటీ తర్వాత తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ మీడియాతో మాట్లాడారు. “రామమందిరానికి భారీ స్థాయిలో బంగారం, వెండి, ఇతరత్రా అత్యంత విలువైన ఆభరణాలు, వస్తుసామగ్రిని ఇచ్చిన దాతలు తామిచ్చిన విరాళాలు ఉన్నాయో లేదో సరిచూసుకునేందుకు అవకాశం కల్పిస్తాం. నగదుకాని 2,926 కానుకల సంబంధ రికార్డులు, డాక్యుమెంట్లను బహిరంగంచేస్తాం. ఎవరైనా వచ్చి వాటిని సరిచూసుకోవచ్చు. చోరీకి పాల్పడిన వారికి తగిన శిక్ష పడేలా చేస్తాం. చోరీ ఘటనతో ఆలయంపై ఆరోపణల మచ్చ పడింది. ఇలాంటివి పునరావృతంకాకుండా, మళ్లీ ప్రజల విశ్వాసం చూరగొనేలా ట్రస్ట్ సభ్యులంతా ఎంతో పారదర్శకంగా పనిచేస్తారు. ఆలయాన్ని మరింత సమర్ధవంతంగా, ఆదర్శప్రాయంగా నిర్వహించేందుకు, నిపుణుల నుంచి సలహాలు తీసుకోబోతున్నాం”అని తాత్కాలిక ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్ అన్నారు. శతాబ్దాలపోరాట ఫలితంగా సాకారమైన ఆలయంలో కొంతకాలంగా హుండీల నుంచి విరాళాలు చోరీ అవుతున్నాయన్న విషయం తెలియగానే ట్రస్ట్ సభ్యులు, భక్తులు ఎంతో కలతచెందారని, ఇది నిజంగా చాలా ఇబ్బందికర పరిస్థితి అని ట్రస్ట్ కోశాధికారి గోవింద్‌దేవ్ గిరి వ్యాఖ్యానించారు. ఈనెల 22వ తేదీన ట్రస్ట్ మరోసారి సమావేశంకానుంది. సోమవారంనాటి భేటీలో ట్రస్ట్ చైర్మన్ నృత్యగోపాల్ దాస్‌సహా ఏడుగురు శాశ్వత సభ్యులు హాజరయ్యారు. సాయంత్రం ఆరున్నరదాకా భేటీ కొనసాగింది.

# చర్చల యుద్ధానికి సిద్ధం

లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లు, లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రవేశపెట్టి భంగపడిన అధికార ఎన్‌డీఏ కూటమి ఈసారి మరింత పదునైన వ్యూహంతో ముందుకొస్తోంది. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదింపజేసుకోవాలని మోదీ సర్కార్ కృతనిశ్చయంతోఉంది. అయితే బడ్జెట్ సమావేశాల్లో ఐక్యత చాటి మహిళా రిజర్వేషన్ చట్టసవరణ బిల్లును వీగిపోయేలా చేసినట్లే ఈసారి ఉమ్మడిగా ఎన్‌డీఏ కూటమిని ఎదుర్కోవాలని విపక్షాలు పట్టుదలగా ఉన్నాయి. దీంతో జూలై 20వ తేదీ నుంచి ఆగస్ట్ 13వ తేదీదాకా ఈసారి వర్షాకాల సమావేశాలు వ్యూహప్రతివ్యూహాలతో హోరాహోరీగా సాగనున్నాయి. మొత్తంగా ఈసారి 19 సార్లు ఇరుసభలు సమావేశంకానున్నాయి. బడ్జెట్ సెషన్‌లో మహిళా రిజర్వేషన్ చట్టసవరణ బిల్లును వీగిపోయేలా చేసినప్పటికీ ఇప్పటికీ అధికార, విపక్షల బలాబలాల్లో మార్పులొచ్చాయి. ఇటీవల రాజ్యసభలో ఖాళీ అయిన 27 స్థానాల కోసం జరిగిన ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో గెలిచి ఎన్‌డీఏ తన బలాన్ని పెంచుకుంది. వీళ్లుగాక స్వతంత్రులు, నామినేటెడ్ సభ్యులు, చిన్న పార్టీల మద్దతునూ కూడగడుతోంది. దీంతో రాజ్యసభలో ఎన్‌డీఏ బలం 150కి చేరుకోబోతోంది. ఇది రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి కావాల్సిన మూడింట రెండొంతుల సంఖ్యాబలం(160)కి సమీపంలో ఉండటం గమనార్హం. పశ్చిమబెంగాల్‌లో ఖాళీగాఉన్న మరో మూడు రాజ్యసభ స్థానాలనూ కైవసం చేసుకోవడం ద్వారా బీజేపీ తన సంఖ్యాబలాన్ని మరింత పెంచుకోనుంది. దీంతోపాటు లోక్‌సభలోనూ బీజేపీ బలం ఎక్కువకానుంది.

**తగ్గిన విపక్షాల బలం**

ఇటీవల వెలువడిన పలు రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాల తర్వాత విపక్ష పార్టీల సంఖ్యాబలం తగ్గిపోయింది. దీంతో విపక్ష పార్టీల మధ్య ఐక్యత సైతం బలహీనపడింది. తమిళనాడులో ప్రభంజనం సృష్టించిన అధికార పగ్గాలు చేపట్టిన విజయ్ జోసెఫ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం(టీవీకే) పార్టీతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడం సుతరామూ ఇష్టంలేని మిత్రపక్షం డీఎంకే తన మైత్రిబంధానికి చరమగీతం పాడింది. వీటికితోడు పశ్చిమబెంగాల్‌లో మమత బెనర్జీని షాక్‌కు గురిచేస్తూ 20 మంది టీఎంసీ ఎంపీలు సిటిజెన్స్ పార్టీ ఆఫ్ ఇండియాకి మద్దతు పలికారు. ఈ పార్టీ ఇప్పటికే ఎన్‌డీఏకూ మిత్రపక్షంగా ఉంది. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రేకు గుడ్‌బై చెప్పి ఆరుగురు శివసేన(యూబీటీ) ఎంపీలు పరోక్షంగా బీజేపీకి మద్దతు పలకడంతో లోక్‌సభ, రాజ్యసభలో ఎన్‌డీఏ మరింత బలం పుంజుకుంది.



ప్రతిష్టాత్మకమైన నీట్ ప్రశ్నాపత్రాలు లీక్ కావడం, సీబీఎస్ఈ పన్నెండో తరగతి విద్యార్థుల డిజిటల్ మూల్యాంకనం తప్పులతడకగా మారడం, అయోధ్యలోని రామమందిరానికి వచ్చిన కోట్ల రూపాయల విరాళాలు, స్వర్ణాభరణాలు చోరీకి గురికావడం, దేశంలో నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకడం, పశ్చిమాసియా యుద్ధాగ్ని జ్వాలల భారత్‌లో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ సెగలు పుట్టించడంతో ప్రభుత్వ అంతర్గత, విదేశాంగ విధానం విఫలమైందంటూ విపక్షాలు పార్లమెంట్ వేదికగా పదునైన విమర్శనాస్త్రాలు సంధించనున్నాయి. టీఎంసీ, శివసేన(యూబీటీ) తిరుగుబాటుఎంపీల మద్దతులో లోక్‌సభలో ఎన్‌డీఏ బలం 318 లేదా 319కి పెరిగే వీలుంది. అయినాసరే మూడింట రెండొంతుల(360) బలానికి బీజేపీ 40 స్థానాలను సమకూర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

**సభలో ప్రవేశపెట్టబోయే బిల్లులు, నివేదికలు..**

ఢిల్లీలో అధికారిక నివాసంలో కాలిన కరెన్సీ కట్టలు వెలుగుచూసిన ఉదంతంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంతవర్మను పదవి నుంచి తొలగించేందుకు, కేసు దర్యాప్తు కోసం ఏర్పాటైన ముగ్గురు సభ్యుల కమిటీ తన నివేదికను లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే ఈ అంశంలో అధికార, విపక్షాలు ఏకతాటిమీదకొచ్చాయి.

**ఇవీ బిల్లులు..**

1. రాజ్యాంగ(130వ) సవరణ బిల్లు
తీవ్రమైన నేరాలకు పాల్పడి అరెస్టయి ఏకధాటిగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలోనే ఉండిపోయిన ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులను పదవుల నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన బిల్లు సభ ముందుకురావొచ్చు. అయితే ఇప్పటికే ఈ బిల్లు సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

2. విదేశీ విరాళాల(నియంత్రణ) సవరణ బిల్లు, 2026
ఈ ఏడాది మార్చి 25వ తేదీన ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు.

3. వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు
గత ఏడాది డిసెంబర్‌లో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

4. సెక్యూరిటీస్ మార్కెట్ బిల్లు, 2025
ఈ బిల్లును 2025 డిసెంబర్ 18వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

5. కార్పొరేట్ చట్టాల(సవరణ)బిల్లు, 2026
2026 మార్చి 23వ తేదీన లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఇప్పటికే సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది.

## కేంద్ర కేబినెట్ విస్తరణకు బ్రేక్...

**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కావడానికి ముందే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రధాని నరేంద్ర మోదీ చేస్తారని జోరుగా ప్రచారం జరిగింది. మోదీ తన టీమ్‌ను పూర్తిస్థాయిలో మార్చేస్తారని, పనితీరు సరిగ్గా లేని మంత్రులను తొలగించి కొత్త ముఖాలకు, ముఖ్యంగా ఎన్డీయే కూటమి భాగస్వామ్య పక్షాలకు పెద్దపీట వేస్తారని అనుకున్నారు. అయితే, శనివారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వర్షాకాల సమావేశాల అధికారిక షెడ్యూల్‌ను ప్రకటించడంతో.. ఢిల్లీ పొలిటికల్ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. పార్లమెంట్ వేదికగా అత్యంత కీలకమైన సెషన్ నడవబోతున్న తరుణంలో.. ఈ లోపు క్యాబినెట్ విస్తరణ చేపట్టే సాహసం ప్రధాని మోదీ చేయడం లేదని, ఈ మార్పు చేర్పుల ప్రక్రియను ఆయన వ్యూహాత్మకంగా వాయిదా వేశారని క్లారిటీ వచ్చిందికేంద్ర కేబినెట్ మార్పుచేర్పుల వాయిదా వెనుక ఒక పక్కా పొలిటికల్ టైమింగ్ దాగి ఉందని తెలుస్తోంది. జూలై 20 నుండి ప్రారంభం కానున్న సమావేశాల ముందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకమైన, వివాదాస్పదమైన రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకురాబోతోంది. ముఖ్యంగా పీఎం, సీఎంల ఆటోమేటిక్ డిస్క్వాలిఫికేషన్‌కు సంబంధించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు పై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ జూలై 17న తన నివేదికను సమర్పించనుంది. దీనితో పాటు వన్ నేషన్ ? వన్ ఎలక్షన్ బిల్లుపై కూడా ఉభయ సభల్లో వాడివేడి చర్చలు జరగనున్నాయి. ఇలాంటి అత్యంత సంక్లిష్టమైన చట్టాలు పాస్ కావాల్సిన సమయంలో క్యాబినెట్‌ను కదిలిస్తే.. ప్రయారిటీ మారిపోతుందని అనుకుంటున్నారు.పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత, ఆగస్టు చివరి వారంలో లేదా సెప్టెంబర్ మొదటి వారంలో ఈ మెగా క్యాబినెట్ విస్తరణ , బిజెపి సంస్థాగత మార్పులు ఏకకాలంలో జరిగే అవకాశం ఉంది. ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు కూడా క్యాబినెట్ విస్తరణపై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాల్సిన అవసరాన్ని ప్రధానికి గుర్తుచేశాయి జూన్ చివరి వారంలో ప్రధాని మోదీ.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అవ్వడం, ఆ తర్వాత వివిధ శాఖల కార్యదర్శులతో వికసిత్ భారత్ రోడ్‌మ్యాప్‌పై సుదీర్ఘ సమీక్షలు నిర్వహించడం వెనుక.. ఏ ఏ మంత్రుల పనితీరు ఎలా ఉందో స్వయంగా నివేదికలు తెప్పించుకోవడానికేనని స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వ మనుగడ, రాబోయే రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల సమీకరణాలను బ్యాలెన్స్ చేయాల్సి ఉన్నందున.. తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం కంటే, పూర్తి స్థాయి నివేదికలతో సెప్టెంబర్‌లో రంగంలోకి దిగడమే ఉత్తమమని ప్రధాని డిసైడ్ అయ్యారు.ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర మంత్రివర్గ మార్పులపై వెనక్కి తగ్గలేదు, కేవలం సమయాన్ని మాత్రమే మార్చారు. వర్షాకాల సమావేశాల రూపంలో విపక్షాల నుండి రాబోయే పొలిటికల్ తుఫానును సమర్థవంతంగా ఎదుర్కొని, తమకు కావలసిన కీలక బిల్లులను పార్లమెంట్‌లో గట్టెక్కించుకోవడమే ప్రస్తుతానికి మోదీ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత. ఆ తర్వాతే.. సెప్టెంబర్ వేదికగా ‘టీం మోదీ’ లోకి సరికొత్త భారీ మార్పులు, భారీ చేర్పులు ఉండబోతున్నాయనేది ఢిల్లీ వర్గాల అంచనా.

## పక్కనే ఉన్న ఆంధ్రాను చూసి కర్ణాటక చాలా నేర్చుకోవాలి

అభివృద్ధి విషయంలో కర్ణాటక ప్రభుత్వం పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌ను చూసి నేర్చుకోవాలని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హితవు పలికారు. రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణ కోసం ఐక్యంగా పనిచేయడంలో కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. సోమవారం బెంగళూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర అభివృద్ధి విషయానికి వస్తే, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్‌లోని నాయకులంతా ఏకతాటిపై నిలుస్తారని కుమారస్వామి ప్రశంసించారు. కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రయోజనాలను సాధించుకోవడంలో ఏపీ చూపుతున్న చొరవను కర్ణాటక ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీ, అనకాపల్లిలో ఏర్పాటు చేయనున్న గ్రీన్ స్టీల్ ప్లాంట్ వంటి అంశాలను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక కృషి చేశారని, అనకాపల్లి ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి స్వయంగా హాజరు కావాలని తనను కోరారని కుమారస్వామి గుర్తుచేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పరిణామాల నేపథ్యంలో అక్కడి ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి సైతం ఎలక్ట్రిక్ బస్సులు, స్టీల్ ప్లాంట్ వంటి ప్రాజెక్టుల కోసం కేంద్ర సహకారాన్ని పదేపదే కోరుతున్నారని ప్రస్తావించారు. “తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ, ఆయన పలుమార్లు కేంద్రం పెద్దలను కలిసి రాష్ట్రం ప్రయోజనాల కోసం విజ్ఞప్తులు చేశారు” అని పేర్కొన్నారు. కానీ, కర్ణాటకలో పరిస్థితి దీనికి భిన్నంగా ఉందని కుమారస్వామి ఆరోపించారు. కుద్రేముఖ్ ఐరన్ ఓర్ కంపెనీకి సంబంధించిన మైనింగ్ కార్యకలాపాలకు రాష్ట్ర ప్రభుత్వమే అడ్డంకులు సృష్టిస్తోందని, దీనివల్ల వేలాది మంది ఉద్యోగాలు ప్రమాదంలో పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పరిస్థితి విషమిస్తే అందుకు రాష్ట్ర ప్రభుత్వమే ప్రత్యక్ష బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. బెంగళూరు నగరంలో చెట్లను పెంచామని ఒక రాష్ట్ర మంత్రి చెబుతున్నారని, కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వరి నాటు వేసినట్లుగా చెట్లను నాటారని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్రంలో తాను భారీ పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందని కుమారస్వామి మండిపడ్డారు.

## ఉగ్రం’ రైఫిల్‌కు కేంద్రం పచ్చజెండా..



కేవలం 100 రోజుల రికార్డు సమయంలో రూపకల్పన, ప్రోటోటైప్

రక్షణ రంగంలో ‘ఆత్మనిర్భర్ భారత్’ స్ఫూర్తితో మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణకు చెందిన స్టార్టప్ సంస్థ ‘ద్విప డిఫెన్స్’ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 7.62ఇ51 ఎంఎం ‘ఉగ్రం’ అసాల్ట్ రైఫిల్, భారత సైన్యం మరియు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఏ) నిర్వహించిన కఠిన పరీక్షల్లో విజయవంతంగా ఉత్తీర్ణత సాధించింది. ఈ ఫలితంతో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల (సీఏపీఎఫ్) అమ్ములపొదిలోకి ఈ స్వదేశీ ఆయుధం చేరేందుకు మార్గం సుగమమైంది. రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) పరిధిలోని ‘ఆర్మమెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్’ (ఏఆర్‌డీఈ) సహకారంతో ద్విప డిఫెన్స్ కేవలం 100 రోజుల రికార్డు సమయంలో ఈ రైఫిల్ ప్రోటోటైప్‌ను సిద్ధం చేసింది. దేశంలోని విభిన్న వాతావరణ పరిస్థితుల్లో నిర్వహించిన ఫీల్డ్ ట్రయల్స్, విశ్వసనీయత మరియు సామర్థ్య పరీక్షల్లో ఇది తన సత్తా చాటింది. దీంతో సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఎస్ఎస్‌బీ, ఎన్ఎస్‌జీ వంటి భద్రతా బలగాల్లో దీన్ని ప్రవేశపెట్టే ప్రక్రియ వేగవంతం కానుంది.

**రైఫిల్ ప్రత్యేకతలు**

‘ఉగ్రం’ రైఫిల్ బరువు 4 కిలోల కంటే తక్కువగా ఉండి, 500 మీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం అత్యంత కచ్చితత్వంతో ఛేదించగలదు. ఇందులో 20 రౌండ్ల సామర్థ్యం గల మ్యాగజైన్ ఉండగా, ఇది సింగిల్ మరియు ఫుల్ ఆటోమేటిక్ ఫైరింగ్ మోడ్‌లను సపోర్ట్ చేస్తుంది. ముఖ్యంగా ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలు, క్లిష్టమైన ఆపరేషన్ల కోసం దీనిని ప్రత్యేకంగా రూపొందించారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో కేటాయించిన 13 ఎకరాల స్థలంలో ద్విప డిఫెన్స్ తన తయారీ కేంద్రాన్ని నెలకొల్పింది. ఈ విజయంపై కంపెనీ ఎండీ సిబు జోసెఫ్ స్పందిస్తూ, వివిధ భద్రతా బలగాల నుంచి ఈ రైఫిల్‌కు మంచి ఆదరణ లభించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామంతో రక్షణ రంగ పరికరాల తయారీ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ స్థానం మరింత పటిష్ఠమైంది.

## ఆమీర్ మూడో పెళ్లి: అంబానీ కుటుంబానికి తృటిలో తప్పిన ప్రమాదం

ప్రముఖ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ కుటుంబానికి తృటిలో భారీ ప్రమాదం తప్పింది. ముంబైలోని బాంద్రా ప్రాంతంలో కుండపోత వర్షాలు, బలమైన గాలుల మధ్య అంబానీ భద్రతా కాన్వాయ్ ముందు ఒక చెట్టు కూలిపోవడంతో, కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో ట్రాపిక్‌లో కొద్దిసేపు ఆగిపోవాల్సి వచ్చింది. అంబానీ కుటుంబం బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మూడో వివాహ వేడుకకు వెళుండగా ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. అంబానీ కుటుంబానికి ఖరీదైన కార్లంటే ఎంత ఇష్టమో అందరికీ తెలిసిందే. అనేక విలాసవంతమైన, సౌకర్య వంతమైన కార్లు వారి సొంతం. పలు భద్రతా ఫీచర్లతో కూడిన లగ్జరీ అంబానీ కాన్వాయ్ సాఫీగా సాగేందుకు గాను , వారి వ్యక్తిగత భద్రతా వాహనాలు ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేయడం కూడా గతంలో చూశాం. అయితే తాజాగా ముంబైలో భారీ వర్షాలకు, దేశంలోనే అత్యంత సంపన్న కుటుంబానికి కూడా ఇక్కట్లు తప్పలేదు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో ‘ఎశ్రీఅఎనిఝఎష్ట్రఅఅ’ షేర్ చేశారు. దీని ప్రకారం అంబానీ కాన్వాయ్ రోడ్డు మధ్యలో ఆగిపోవడం కనిపిస్తుంది. ముందు వరుసలో రేంజ్ రోవర్ (ఝఅస్త్రవ =శీజవతీ) ఉండగా, దాని వెనుక మెర్సిడెస్-బెంజ్ ఎస్-క్లాస్ (వీవతీషవసవం-దీవఅఓ రా-జశ్రీఝం) ఉంది. ఎస్-క్లాస్ వెనుక టయోటా ఫార్చ్యూనర్ (ూశీఎశ్మీ ఖీశీతీబఅవతీ) ఇతర వాహనాల వరుసను ఈ వీడియోలో చూడవచ్చు. చెట్లు నేలకూలి రోడ్డుపై పడి ఉండటం వల్ల పరిస్థితి ప్రమాదకరంగా మారింది. ట్రాఫిక్‌ను పూర్తిగి స్తంభించిపోవడంతో కాసేపు అంబానీ కుటుంబం రోడ్డుపైనే ఆగిపోవాల్సి వచ్చింది. అటు అంబానీ కుటుంబ భద్రతా సిబ్బంది చేయలేకపోయింది. మెర్సిడెస్-బెంజ్ ఎస్-క్లాస్ బుల్లెట్-రెసిస్టెంట్ (బుల్లెట్ ప్రూఫ్) మెర్సిడెస్-బెంజ్ రా680 గార్డ్ సెడాన్. వీడియోలో కనిపిస్తున్న వాహనం బంగారు రంగు (గోల్డ్ షేడ్)లో ఉన్నట్లు అనిపిస్తోంది. ఈ కుటుంబం వద్ద ఉన్న నాలుగు రా-క్లాస్ గార్డ్ సెడాన్లలో ఇది ఒకటని సమాచారం. ఈ కారు ఔ223 తరానికి చెందినది మరియు వూూవీ ఎ=10 ధృవీకరణను కలిగి ఉంది; పౌర వినియోగ వాహనాలకు లభించే అత్యున్నత స్థాయి బాలిస్టిక్ రక్షణగా దీనిని పరిగణిస్తారు. ఇది బాలిస్టిక్ ముప్పుల నుండి రక్షణ కల్పించడమే కాకుండా, పేలుడు పదార్థాల నుండి కూడా కాపాడుతుంది. బుల్లెట్ , పేలుడు నిరోధక అద్దాలప్రత్యేకతగా ఉన్న వీవతీషవసవం-దీవఅఓ రా680 +ఝతీస శక్తివంతమైన 6.0-లీటర్ ఎ12 ఇంజిన్‌తో పనిచేస్తుంది, ఇది 612 ఎష్ట్రజూ పవర్‌ను, 830 చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది.

# రాష్ట్ర ప్రభుత్వం బంపరాఫర్

-మొదటిపేజీ తరువాయి

కూడా నగదు పురస్కారాన్ని ఇస్తామని తెలిపారు. ఇలా ప్రతి జిల్లాలో ఆరు జంటలకు పైవిధంగానే రూ.5 వేల చొప్పున నగదు అందచేస్తామని మంత్రి తెలిపారు.

ఎక్కువ మంది ఉంటే లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. కాన్పు, కాన్పుకు మధ్య కనీసం రెండేళ్లు విరామం పాటిస్తే తల్లీబిడ్డల ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. ఈ విధానాన్ని పాటిస్తే మాతృత్వ మరణాల్లో 30 శాతం, శిశు మరణాల్లో 10 శాతం వరకు తగ్గుతాయని సత్యకుమార్ పేర్కొన్నారు.

**పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ**

ఇన్నాళ్లూ కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలను ప్రోత్సహించిన ప్రభుత్వం, రాష్ట్రంలో జనాభా పరంగా గతి తప్పుతున్న పరిస్థితులతో అప్రమత్తమైంది. నానాటికీ యువత సంఖ్య తగ్గి వృద్ధుల జనాభా పెరుగుతుండటంతో క్షేత్రస్థాయి పరిస్థితులను చక్కదిద్దేందుకు సమాయత్తమవుతోంది. దీంతో ఆగస్టు 15 నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలు చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ప్రతి నెలా నాలుగో శనివారం 'పిల్లలే సంపద' గ్రామసభలు నిర్వహిస్తారు. జనాభా సంఖ్యను నియంత్రించడం కంటే ప్రజల ఆరోగ్యం, కుటుంబ భద్రత, జీవన ప్రమాణాల మెరుగుపై దృష్టి పెడితే ఆరోగ్యాంధ్ర సాకారమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ దిశగా కీలక ప్రణాళికలతో ఆరోగ్యాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ అమలుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం రూ.782.25 కోట్ల నిధులతో ప్రణాళికలను పట్టాలెక్కించనుంది.

**నియంత్రణకు స్వస్తి**

జనాభా నియంత్రణ విధానాలకు స్వస్తి పలికి, జనాభా సంరక్షణ దిశగా దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీ4 మోడల్‌లో హక్కుల ఆధారిత విధానం తెచ్చి, కుటుంబాల హక్కులను గౌరవిస్తూ సమగ్ర జనాభా సంక్షేమాన్ని ప్రోత్సహించనుంది. పిల్లల పెంపకానికి ఎక్కువ ఖర్చవుతు ందని ప్రణాళిక విభాగం సర్వేలో వెల్లడించిన 53.7% ప్రజల సమస్యలను తగ్గించడంపై దృష్టి సారించనుంది.

**సంక్షేమం, అభివృద్ధి ప్రణాళికలివీ :**

మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1కి పెంచడం లక్ష్యం

ఏటా 50 వేల జంటలకు ఉచితంగా ఐవీఎఫ్ సౌకర్యం కల్పిస్తారు

కు.ని. శస్త్రచికిత్సలకు ప్రాధాన్యం తగ్గిస్తారు



అందరికీ 100% డిజిటల్ ఆరోగ్య సేవలు చేరువ చేస్తారు

మహిళా కార్మికశక్తి భాగస్వామ్యాన్ని 25% పెంచేందుకు కృషి చేస్తారు

శిశు సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, 12 నెలల పాటు తల్లిదండ్రుల ప్రసూతి సెలవుల పైలట్ ప్రాజెక్టు అమలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణం చేపడతారు

అన్ని జిల్లాల్లో వృద్ధుల సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తారు

ఇతరులపై ఆధారపడే వారి నిష్పత్తి పెరగకుండా చూస్తారు

జీవితకాల నైపుణ్యం లక్ష్యంగా 80% ఉద్యోగ నియామక రేటు సాధించడంపై దృష్టి పెడతారు

స్టేట్ స్కిల్ అబ్జర్వేటరీ ద్వారా ఏటా 10 వేల మంది సంరక్షణ రంగ (కేర్ ఎకానమీ) కార్మికులకు శిక్షణ కల్పిస్తారు.

సీఎం పర్యవేక్షణలో స్ట్రీనింగ్ కమిటీ : పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీని ప్రతిష్మాత్మకంగా తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రాజెక్టు పనితీరును ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడంతో పాటు జిల్లాల పర్యటనలకూ సిద్ధమవుతున్నారు.

వ్యూహాత్మక పర్యవేక్షణకు సీఎం అధ్యక్షతన అత్యున్నత స్ట్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేస్తారు

కీలక శాఖలతో సమన్వయం కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జనాభా స్థిరీకరణ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుంది.

రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిల్లో సమన్వయానికి వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆరోగ్యాంధ్ర జనాభా నిర్వహణ మిషన్ కార్యకలాపాలు చేపడుతుంది.

ఐటీ శాఖ పరిధిలో డేటా విశ్లేషణ, డ్యాష్ బోర్డు నిర్వహణ, సూచనల రూపకల్పన.

కలెక్టర్లు ప్రతినెలా జిల్లా స్థాయిలో, తహసీల్దార్లు ప్రతివారం మండల స్థాయిలో సమన్వయ కమిటీ సమావేశాలతో ప్రాజెక్టు సమర్థ అమలుకు చర్యలు తీసుకుంటారు.

కీలక శాఖల పర్యవేక్షణలో లక్ష్యాలు చేరుకునేలా ప్రణాళిక అమలు చేస్తారు.

పనితీరు ఆధారంగా సచివాలయాలకు ప్రోత్సాహకాలు, ఆరోగ్యాంధ్ర పురస్కారాలు అందజేస్తారు.

# మడ అడవులతో తీరానికి రక్షణ

-మొదటిపేజీ తరువాయి

తీరంలోనూ మొక్కల పెంపకం కొనసాగుతోంది. మడ అడవుల విస్తీర్ణం పెరిగే కొద్దీ తీర ప్రాంత పర్యావరణ సమతుల్యత మెరుగుపడుతుందని అధికారులు చెబుతున్నారు. రేపల్లె, నిజాంపట్నం, కర్లపాలెం, బాపట్ల, చినగంజాం మండలాల్లో సముద్ర తీరం వెంబడి మడ అడవులు విస్తరించి ఉన్నాయి. గతంలో జిల్లాలో 8 వేల ఎకరాలకు పైగా ఉండేవి. అక్రమ నరికివేత, రొయ్యల చెరువుల విస్తరణతో ఆ విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. 1977 దివిసీమ ఉప్పెన, 1990, 1996, 2008, 2010 తుపానులు, 2004 సునామీ వంటి ప్రకృతి విపత్తుల సమయంలో మడ అడవులు తీర ప్రజలకు పెను నష్టం జరగకుండా అడ్డుకట్ట వేశాయి. ఈ నేపథ్యంలో వాటి విస్తరణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

150 హెక్టార్లలో కొత్తగా మొక్కలు: కేంద్ర నిధుల సహాయంతో నిజాంపట్నం పరిధిలో 75 హెక్టార్లలో మడ అడవుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తాజాగా సూర్యలంక వద్ద నల్లమడ వాగు సముద్రంలో కలిసే ప్రాంతంలో 150 హెక్టార్లలో మొక్కల పెంపకం ప్రారంభించారు. నర్సరీల్లో పెంచిన మొక్కలను నాటారు.

ప్రపంచ మడ అడవుల దినోత్సవం సందర్భంగా అదనంగా మరో 100 హెక్టార్లలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వీటితో పాటు 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ' పథకం కింద సూర్యలంక, పేరలి, నిజాంపట్నం తీర ప్రాంతాల్లో తాటి, ఈత చెట్లను పెంచుతున్నారు. ఈ ప్రాంతాలను మడ అడవుల కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.



విదేశీ పక్షుల విడిది: సూర్యలంక నుంచి నిజాంపట్నం, దిండి, లంకెవానిదిబ్బ వరకు ఉన్న మడ అడవులు పర్యావరణ సున్నిత ప్రాంతంగా ఉన్నాయి. ఇవి విదేశీ పక్షులతో పాటు అరుదైన జీవరాశులకు నిలయాలుగా మారాయి. కుందేళ్లు, అడవి పిల్లులు, స్వదేశీ, విదేశీ పక్షులు ఇక్కడ కనిపిస్తున్నాయి. తీర పర్యాటక అభివృద్ధికి ఇవి ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి. నిజాంపట్నం, కర్లపాలెం, చినగంజాం మండలాల్లోని ఆక్రమణలను తొలగించి, ఆ ప్రాంతాల్లో మొక్కలు నాటి తీరాన్ని పచ్చదనంతో నింపాల్సిన అవసరం ఉందని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.

వివరాలు:

బాపట్ల జిల్లా తీరప్రాంతం: 74 కి.మీ

అటవీ భూముల విస్తీర్ణం: 16,574 ఎకరాలు

మడ అడవుల విస్తీర్ణం: 6,000 ఎకరాలు

# 2029 నయా పాలసీతో టీడీపీ

**గుంటూరు :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి అనేక మంది నాయకులకు రాజకీయంగా ఎదిగే అవకాశాలను కల్పించింది. ఈ పార్టీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు మాత్రమే కాకుండా లోక్‌సభ స్పీకర్ కేంద్ర మంత్రులు గవర్నర్లు ముఖ్యమంత్రులువంటి కీలక పదవులను కూడా పలువురు నాయకులు అధిరోహించారు. అందుకే ప్రాంతీయ పార్టీల్లో టీడీపీకి ప్రత్యేక రాజకీయ చరిత్ర ఉందని రాజకీయ వర్గాలు భావిస్తుంటాయి.2024 ఎన్నికల్లో పార్టీ పెద్ద ఎత్తున యువ నాయకులకు, కొత్త ముఖాలకు అవకాశం కల్పించింది. గ్రామస్థాయి ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు, పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడిన నాయకులు కూడా ఈసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరిలో చాలామంది ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ నియోజకవర్గాల్లో చురుకుగా పనిచేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే మరికొందరు మాత్రం ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ప్రజలకు దూరమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో టీడీపీ అధిష్ఠానం తమ పార్టీ ఎమ్మెల్యేల పనితీరును సమగ్రంగా సమీక్షిస్తున్నట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతి, ప్రజల సమస్యలపై స్పందన, పార్టీ కార్యకర్తలతో సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాలపై ప్రత్యేకంగా నివేదికలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. టెలికాన్ఫరెన్స్‌లు, సమీక్షా సమావేశాలు, ప్రత్యక్ష చర్చల ద్వారా ఎమ్మెల్యేలకు ఎప్పటికప్పుడు మార్గదర్శకాలు కూడా అందిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.అయితే అన్ని సూచనలు ఇచ్చినా కొందరు ఎమ్మెల్యేల పనితీరులో ఆశించిన మార్పు కనిపించడం లేదని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వివిధ వర్గాల నుంచి వచ్చిన నివేదికలు, క్షేత్రస్థాయి సమాచారం, పార్టీ అంతర్గత పరిశీలన ఆధారంగా కొంతమంది ప్రజాప్రతినిధులపై అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కేవలం హెచ్చరికలతో సరిపెట్టకుండా ఇకపై క్రమశిక్షణ చర్యలపై కూడా దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక పెన్షన్ కార్యక్రమానికి ప్రజల్లో మంచి స్పందన లభిస్తోంది. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు సహా వివిధ వర్గాలకు భారీ మొత్తంలో పెన్షన్లు అందిస్తున్న నేపథ్యంలో, వాటి పంపిణీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు స్వయంగా పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం కోరుతున్నట్లు సమాచారం. కానీ కొందరు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ముఖ్యంగా తొలిసారి గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలలో ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు తగ్గడం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ప్రజలకు వివరించకపోవడం వంటి అంశాలను పార్టీ సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అవసరమైతే ఆయా నియోజకవర్గాల్లో ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని కూడా ప్రోత్సహించే ఆలోచనలో ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.ఉత్తరాంధ్ర, గోదావరి , కోస్తా ఆంధ్ర , రాయలసీమ ( ప్రాంతాల్లోని కొన్ని నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు సమాచారం. ప్రజలతో నిరంతరం మమేకమై పనిచేసే నాయకులకే భవిష్యత్తులో ప్రాధాన్యం ఉంటుందనే సంకేతాలను పార్టీ అధిష్ఠానం ఇస్తోందని..

## ఏపీని భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ప్రఖ్యాత మెడికల్ డివైస్ సర్టిఫైడ్ స్మార్ట్ హెల్త్‌కేర్ ఫుట్‌వేర్ సంస్థ షూఆల్స్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్, సీఈవో లీ చియాంగ్-గెన్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. షూఆల్స్ సంస్థ ప్రభుత్వంతో చేసుకున్న ఎంవోయూ మేరకు ఏపీలో పాదరక్షల తయారీ యూనిట్ పనులను వేగంగా ప్రారంభించాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. రూ. 300 కోట్లతో ఏర్పాటు కానున్న ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ఉపాధి లభించనుందని తెలిపారు. ఏపీలో ఆర్ అండ్ డీ, ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటు చేసి, ఏపీని రిటైల్, డిస్ట్రిబ్యూషన్? హబ్‌గా మార్చాలని కోరారు. దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్, ఐఓటీ, పవర్ ఎలక్ట్రానిక్స్ తయారీ సంస్థ సోలమ్ గ్రూప్ గ్లోబల్ ఆపరేషన్స్ ఆఫీసర్ జీగాబ్‌తో లోకేశ్ భేటీ అయ్యారు. శ్రీసిటీలో రూ. 338 కోట్లతో ఈవీ ఛార్జర్ పవర్ మాడ్యుల్స్, ఆటోమోటివ్ ఎలక్ట్రానిక్స్ యూనిట్ పనులు త్వరగా పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించాలని కోరారు. శ్రీసిటీ యూనిట్‌లో ఎలక్ట్రానిక్ షెల్ఫ్ లేబుల్స్, ఇతర డిస్‌ప్లే సంబంధిత ఉత్పత్తుల తయారీ కార్యకలాపాలు విస్తరించాలని సోలమ్ సంస్థ సీఈవోకు విజ్ఞప్తి చేశారు.

ఏటా 500 మందికి శిక్షణ: సాధ్యమైనంత త్వరగా శ్రీసిటీ యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సీఈవో చెప్పారు. భారత్‌లోని కంపెనీలతో భాగస్వామ్యం కుదుర్చుకుని ఏపీలో మైక్రో ఎల్‌ఈడీ డిస్ ప్లే-మెటీరియల్ హబ్ ఏర్పాటు చేయాలని "సాఫ్ట్ - ఈపీఐ" కంపెనీ ప్రతినిధులను లోకేశ్ కోరారు. తిరుపతి ఐఐటీ సహకారంతో మైక్రో ఎల్‌ఈడీల్లో ఏటా 500 మంది టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చే అకాడమీ ఏర్పాటు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆవిష్కరణల వెన్నెముకగా ఉన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా "వన్ ఫ్యామిలీ, వన్ ఎంటర్ ప్రెన్యూర్ నినాదంతో ఐదేళ్లలో 20 వేల స్టార్టప్‌లు, లక్ష ఉద్యోగాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి లోకేశ్ తెలిపారు. అమరావతిలో ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న ఆర్‌టీఐహెచ్ విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, అనంతపురం ప్రాంతీయ శాఖలతో పనిచేస్తోందన్నారు. సియోల్ బిజినెస్? ఏజెన్సీ కొరియన్ టెక్ స్టార్టప్‌లతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో లోకేశ్? మాట్లాడారు. ఆర్‌టీఐహెచ్ ఫుల్ లైఫ్ సైకిల్ ప్రోగ్రామ్స్ స్పార్క్, క్యాటలిస్ట్, వెలాసిటీ ల్యాబ్‌ల్లోకి కొరియన్? స్టార్టప్‌లకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు.

భారతదేశ ఏఐ రాజధానిగా ఏపీ: ఆర్‌టీఐహెచ్‌ను కేంద్రంగా చేసుకుని ఇండియా-కొరియా స్టార్టప్ కారిడార్ ఏర్పాటు కోసం కలిసి పని చేద్దామని కొరియన్ సంస్థలను ఆహ్వానిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. ప్రత్యేక కొరియా డెస్క్, సాఫ్ట్-ల్యాండింగ్ "విసి బే", కొరియన్ ఏజెన్సీలతో సహ-ఇంక్యుబేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. దీనిద్వారా రెండువైపులా మార్కెట్ ప్రవేశం లభిస్తుందన్నారు. కొరియన్ స్టార్టప్‌లు భారతదేశంలోని టైర్ 2--3 మార్కెట్లలోకి, ఏపీ స్టార్టప్‌లు కొరియాలోకి రావడం సులభతరమవుతుందన్నారు. ఏపీని భారతదేశ ఏఐ రాజధానిగా నిలపడం తమ ధ్యేయమని లోకేశ్ వెల్లడించారు. హ్యోసంగ్ హెవీ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ పవర్ సిస్టమ్స్ పీయూ ప్రెసిడెంట్ యోకోటా తకేషితో సంస్థ ప్రధాన కార్యాలయంలో లోకేశ్ భేటీ అయ్యారు. రాష్ట్రంలో పారిశ్రామిక అవసరాల కోసం విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ నేపథ్యంలో, విద్యుత్ పరికరాలకు భారీ డిమాండ్ ఉందన్నారు. తిరుపతి లేదా శ్రీసిటీ సమీపంలో స్విచ్‌గేర్లు, ఇతర విద్యుత్ పరికరాల తయారీ లేదా అసెంబ్లింగ్ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా లోకేశ్ విజ్ఞప్తి చేశారు. సియోల్ సెమీ కండక్టర్స్? వైస్? ప్రెసిడెంట్ తాయెహ్యుంగ్? లీతో లోకేశ్? భేటీ అయారు. శ్రీసిటీ లేదా దాని పరిసర ప్రాంతాల్లో సియోల్? సెమీ కండక్టర్స్? సంస్థ డిస్‌ప్లే ఫ్యాబ్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్? విజ్ఞప్తి చేశారు. భారత్‌లో నేరుగా లేదా జాయింట్ వెంచర్ ద్వారా పెట్టుబడి ప్రణాళికలు ఉన్నాయని తాయెహ్యుంగ్? లీ అన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు



-మొదటిపేజీ తరువాయి

స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. ఐదు రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నామని అన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో లాస్ట్ మైల్ గవర్నెన్స్ ప్రజలకు అందాలన్నారు.

గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు

రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్మెంట్-బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలని సీఎం చంద్రబాబు తెలిపారు. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

రాష్ట్రంలో మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాలని, గంజాయి ముఠాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. గంజాయి నిర్మూలనపై తీసుకుంటున్న చర్యలపై సమాచారాన్ని ప్రజల్లోకి వెళ్లేలా చూడాలని చంద్రబాబు నిర్దేశించారు. కేంద్రం కూడా డ్రగ్ ఫ్రీ కంట్రీగా భారత్‌ను తయారుచేసేలా కార్యాచరణ చేపట్టిందని దానికి అనుగుణంగానే లక్ష్యాలను నిర్దేశించుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాల ద్వారా ఎలాంటి ఫలితాలు సాధిస్తున్నామో అన్న అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు విశ్లేషించాలని సీఎం అధికారులకు సూచించారు.

**ప్రతీ అంశంలోనూ పొదుపు మంత్రం**

క్షేత్రస్థాయిలో తాగునీరు, వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలు, ఇంటింటికీ చెత్త సేకరణ లాంటి అంశాల్లో నిర్దిష్టమైన ఎస్ఓపీ జారీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పేరుకున్న 23 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను మూడు నెలల్లోగా తొలగించాలని దీనిపై ప్రజాప్రతినిధులు కూడా శ్రద్ధ పెట్టాలని సూచించారు. జీరో వేస్ట్ మున్సిపల్ ప్రాంతాలు మన లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న దరఖాస్తులను ఆర్థిక, ఆర్థికేతర కేటగిరీలుగా విభజించి పరిష్కారం చూపాలని సీఎం స్పష్టం చేశారు. ఈ విషయంలో కలెక్టర్లు అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వివిధ సమస్యల్ని ఎదుర్కొనేలా ఇతర ప్రాంతాల్లో అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అనుసరించటంతో పాటు ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతీ అంశంలోనూ పొదుపు మంత్రం పాటించాలని సీఎం నిర్దేశించారు. నెలరోజుల్లోగా అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆపరేటర్లను సంప్రదించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పాత్రికేయుల ఐక్యతతోనే హక్కుల సాధన

**ఏపీఎఫ్‌డబ్ల్యూజే జిల్లా కార్యవర్గం ఎన్నిక**




**శంఖవరం, జులై 6 (ప్రజాజ్యోతి న్యూస్)** పాత్రికేయుల వృత్తి గౌరవాన్ని కాపాడుతూ వారి హక్కుల సాధన, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీఎఫ్‌డబ్ల్యూజే) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలోని వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి సీనియర్ పాత్రికేయులు పడాల నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అప్పలస్వామి, రీజినల్ కన్వీనర్ ఎం.వి. మల్లేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, వారికి తగిన భద్రత, సంక్షేమం, ప్రభుత్వ గుర్తింపు వంటి అంశాల్లో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి పరిష్కారం కోసం సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాత్మకంగా పనిచేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యండమూరి వెంకట్రావు (బాబీ), ఉపాధ్యక్షుడిగా గునపర్తి అపురూప్, ప్రధాన కార్యదర్శిగా సకిరెడ్డి గోవిందరావు, సహాయ కార్యదర్శిగా డి. సూర్య, కోశాధికారిగా ఎన్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు యండమూరి వెంకట్రావు (బాబీ) మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి పాత్రికేయుడి సమస్యను సంఘం సమస్యగా భావించి పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, యువ పాత్రికేయులకు శిక్షణ, సభ్యుల సంక్షేమం, అత్యవసర సహాయ నిధి, మీడియా స్వేచ్ఛ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర నాయకులు, సీనియర్ పాత్రికేయులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాత్రికేయులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయులు బి రామారావు, పి శ్రీను, యు శివ దుర్గ, బి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ ప్రక్రియ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**-- ఎంపీడీవో శ్రీ కిరణ్ మోహన్ రావు**




చెన్నూరు మండలంలో జరుగుతున్న డిజిటలైజేషన్ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఉ ూాంర్ జు=ూ శ్రీ కిరణ్ మోహన్ రావు ఆదేశించారు. చెన్నూరు మండలంలో పర్యటించిన ఆయన, దీూాలు 80,82 ఉ 83 పరిధిలో జరుగుతున్న డిజిటలైజేషన్ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఆయా దీూాలతో మాట్లాడి పనుల పురోగతిని సమీక్షిస్తూ, ప్రతి దరఖాస్తును నాణ్యతతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి దీూా రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా ప్రతిరోజూ గణనీయమైన పురోగతి సాధించాలని సూచించారు. ఫీల్డ్ స్థాయిలో అవసరమైన ధృవీకరణ పూర్తి చేసి, డేటాను వెంటనే డిజిటలైజేషన్ చేయాలని తెలిపారు. పనుల నాణ్యతతో పాటు వేగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే, జూలై 7న జరిగే కలెక్టర్స్ కాన్ఫరెన్స్ నాటికి ప్రతి దీూా కనీసం 65 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని గౌరవ జిల్లా కలెక్టర్ గారు ఆదేశించినట్లు శ్రీ కిరణ్ మోహన్ రావు తెలిపారు. ఆ లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సాధించేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చెన్నూరు మండలాన్ని జిల్లాలో ఆదర్శంగా నిలిపే విధంగా అందరూ సమిష్టిగా కృషి చేసి, 100 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయుటలో భాగంగా దీూాలకు సహకరించేందుకు స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది, వెంకటేష్ వెలుగు ూావీ మరియు వారి సిబ్బంది, సిబ్బంది, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు, ూచీవీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా స్వామి వివేకానంద ట్రస్ట్, భారత్ యూత్ అసోసియేషన్




**54వ నెల నిత్యవసర సరుకుల పంపిణీ**

**హోళగుంద,జూన్ 6, ప్రజా జ్యోతి న్యూస్ –** సమాజంలోని నిరుపేదలు, అనాధ వృద్ధులు మరియు వికలాంగులకు అండగా నిలవడమే పరమావధిగా ఆదోని స్వామి వివేకానంద ట్రస్ట్, హోళగుంద భారత్ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా తమ మానవత్వాన్ని చాటుకుంటున్నాయి. ఇందులో భాగంగా, వరుసగా 54వ నెల కూడా నిరుపేద కుటుంబాలకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువురు అర్హులకు నిత్యవసర సరుకులను అందజేశారు. అత్యంత నిరుపేద కుటుంబానికి చెందిన హోటల్ ఈరన్న, ఎర్రమ్మ దంపతులు, మార్లమడికి గ్రామానికి చెందిన వృద్ధురాలు రాధమ్మ, గ్రామానికి రక్షణగా నిలుస్తూ సేవలు అందిస్తున్న గుర్కా నిరుపేద కుటుంబం ఉన్నారు. ప్రతి నెలా అర్హులైన వికలాంగులను, వృద్ధులను గుర్తించి వారికి నిత్యవసర సరుకులు అందించడం మా బాధ్యతగా భావిస్తున్నామని. దాతల, ప్రతి ఒక్కరి సహకారంతో ఈ సేవా కార్యక్రమాలను నిరంతరాయంగా ముందుకు తీసుకెళ్తామని ఆదోని స్వామి వివేకానంద ట్రస్ట్, హోళగుంద భారత్ యూత్ అసోసియేషన్ స్పష్టం చేశారు. నిరంతరాయంగా 54 నెలలుగా సాగుతున్న ఈ సేవా యజ్ఞాన్ని, వారి ఉదారతను స్థానిక ప్రజలు మరియు పలువురు ప్రముఖులు అభినందిస్తున్నారు.

# డోలీపై ప్రాణాల పోరాటం.. ఏజెన్సీ ఆదివాసీల అవస్థలు పాలకులకు కనిపించవా?”

**పాము కాటుకు గురైన యువతిని 7 కిలోమీటర్లు డోలీలో మోసుకెళ్లాల్సిన దుస్థితి.. ప్రభుత్వ నిర్లక్ష్యంపై వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య ఆగ్రహం**




**కూనవరం, జూలై 6: ప్రజా జ్యోతి** ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా, గిరిజనుల జీవితాల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదని వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటూరు పంచాయతీ పరిధిలోని కారుమాను కొండ గ్రామానికి చెందిన చంద్రు సమ్మక్క ప్రియ (18) పాము కాటుకు గురికావడంతో, గ్రామానికి రహదారి లేక కుటుంబ సభ్యులు ఆమెను 7 కిలోమీటర్ల దూరం డోలీలో మోసుకుని కూటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాల్సి రావడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి పేరుతో నిధులు కేటాయిస్తున్నప్పటికీ, అవి గిరిజనుల సంక్షేమానికి ఉపయోగపడడం లేదని, రహదారులు, వైద్యం, విద్యుత్, మంచినీరు, విద్య వంటి కనీస మౌలిక వసతులు కూడా అందని పరిస్థితి కొనసాగుతోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిరిజనులకు కేటాయించిన నిధులను పూర్తిగా వారి అభివృద్ధికే వినియోగించి, ఏజెన్సీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పెద్దర్కూర్ ఎంపీటీసీ అమ్మాజీ, చుచి రేవులగూడెం ఎంపీటీసీ జయసుధ, కుటూరు మాజీ సర్పంచ్ వెంకమ్మ, పెద్దర్కూర్ మాజీ సర్పంచ్ నాగమణి, లింగాపురం మాజీ సర్పంచ్ సోడి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం అవగాహన కల్పించడం

**మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ ఎండి షఫీ నాయక్**



**లక్కిరెడ్డిపల్లి ప్రజా జ్యోతి 06 , జూలై** లక్కిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ నందు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఎండి షఫీ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎండి షఫీ నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేదలకు ఆవాస్ యోజన పథకం కింద ఇంటి నిర్మాణాలకు మంజూరుకు సిద్ధంగా ఉన్నదని గ్రామ సభ ద్వారా 386 మందిని గుర్తించి గ్రామసభ ద్వారా మంజూరు ఇవ్వడం జరిగిందని గుర్తించిన వారికి జియో ట్యాగ్ నిర్వహించి లబ్ధిదారులకు ప్రభుత్వం నుండి అనుమతులు వచ్చిన తర్వాత ఇంటి నిర్మాణాలు చేపట్టవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ డిసిసిబి సభ్యులు రెడ్డి సుబ్బారెడ్డి మండల అభివృద్ధి అధికారి రెడ్డయ్య గ్రామపంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి కాంటాక్ట్ రాజు మండల తెలుగు యువత అధ్యక్షులు కొలిమి పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# నూతన మిర్చి యార్డ్ నిర్మాణ శంకుస్థాపన...



**ప్రజా జ్యోతి ):**రాజుపాలెం, మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో నూతన మిర్చి యార్డ్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరు కావడం జరిగింది ఆయన మాట్లాడుతూ మండలంలో నూతన మిర్చి యార్డ్ నిర్మాణం జరగటం చాలా అభినందనీయమని ఆయన అన్నారు. రైతులకు మిర్చి యార్డు ఎంతగానో ఊరట నిస్తుందని ఆయన అన్నారు ఈ సేవలను మండలంలోని రైతులు అందరూ ఉపయోగించుకోవాలని తమ పంటకు భద్రత మరియు గిట్టుబాటు ధరలు కలి గించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రతి ఒక్క రైతుకు అండగా ఉంటామని రైతే రాజు అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మండల ప్రజా పరిషత్ కార్యాలయం అధికారులు మండల రెవెన్యూ అధికారులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు,

# చెన్నూరు మండలంలో స్మార్ట్ కిచెన్ ట్రైల్ రన్లో భాగంగా 25 పాఠశాలలకు మధ్యాహ్న భోజనం పంపిణీ




చెన్నూరు మండలంలోని కొండపేట గ్రామంలో ఏర్పాటు చేసిన స్మార్ట్ కిచెన్ ట్రైల్ రన్‌ను ఈ రోజు ఉదయం 11.30 గంటలకు ఎంపీడీవో శ్రీ కిరణ్ మోహన్ గారు, మరియు ూావీ వెలుగు శ్రీ వెంకటేష్ గారు మరియు జ=ూ సందర్శించి ఆహారాన్ని భోంచేసి సంతృప్తిని వ్యక్తపరిచినారు. సందర్శన సందర్భంగా అధికారులు ఆహార పదార్థాల నాణ్యత, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, భద్రతా చర్యలు, ప్యాకింగ్ విధానం, రవాణా ఏర్పాట్లు మరియు విద్యార్థులకు భోజనం అందించే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం తయారు చేసి సకాలంలో పాఠశాలలకు చేరవేస్తున్న విధానంపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార భద్రత మరియు మధ్యాహ్న భోజన పథకం మరింత సమర్థవంతంగా అమలుకు స్మార్ట్ కిచెన్ విధానం దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం సంబంధిత సిబ్బందికి అవసరమైన సూచనలు చేస్తూ పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు మరియు ఆహార భద్రతా నిబంధనలను నిరంతరం పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకాలంలో భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో, చెన్నూరు

# దౌలతాపురం బలసింగనపల్లి గ్రామపంచాయతీలో స్వచ్ఛ రథం పరిశీలన ఎంపీడీవో




చెన్నూరు మండల పరిధిలోని దౌలతాపురం బలసింగనపల్లి గ్రామపంచాయతీలో స్వచ్ఛ రథాన్ని ఈ రోజు చెన్నూరు ఎంపీడీవో శ్రీ కిరణ్ మోహన్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ రథంలో ప్రజలకు అందుబాటులో ఉంచిన నిత్యావసర వస్తువులు, నిర్వహణ విధానం, పరిశుభ్రత, రికార్డులు మరియు సేవల అందింపుపై ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలకు అవసరమైన వస్తువులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత నిర్వాహకులకు సూచించారు. స్వచ్ఛ రథం ద్వారా గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వస్తువులు, పరిశుభ్రతకు సంబంధించిన అవగాహన సేవలు సమర్థవంతంగా అందించాలని, నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలని ఎంపీడీవో ఆదేశించారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ, స్వచ్ఛత కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

# శ్రీ శ్రీ శ్రీ నీలమణి దుర్గ అమ్మవారిని దర్శించుకున్న కేంద్రమంత్రి ,ఎమ్మెల్యే ఎంజీ ఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :- యం. నరేష్ శ్రీకాకుళం** పాతపట్నంలో వెలిసియున్న ఉత్కలాంధ్ర ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గ అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర పౌర విమానయాన శాఖ మాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు మామిడి గోవిందరావు .జిల్లా కలెక్టర్ మరియు ఆర్డిఓ, తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తాపడి వ్యక్తి మృతి.. కుమారుడికి గాయాలు



**ఆమదాలవలస:::** ప్రజాజ్యోతి ఆటో బోల్తాపడిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని కుమారుడు తీవ్రంగా గాయపడిన ఘటన ఆమదాలవలస మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన బత్తిలి సింహాచలం (34) శనివారం రాత్రి తన కుమారుడు అభిషేక్ ఆరాప్తో కలిసి ఆటోలో ఆమదాలవలసకు వస్తున్నారు. ఈ క్రమంలో అప్పలరాజు కాలనీ సమీపానికి చేరుకోగానే ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా వారిని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ సింహాచలం పరిస్థితి విషమించి మృతి చెందాడు. గాయపడిన కుమారుడు అభిషేక్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద స్థలాన్ని ఆమదాలవలస ఎస్సై బాలరాజు పరిశీలించి, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్న వి బి గ్రామ్ జీ పథకాన్ని వ్యతిరేకించండి

**సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ**
**రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉదయ్ కిరణ్**



**రాయచోటి జూలై 06 ప్రజా జ్యోతి** వి. బి గ్రామ్ జి పథకాన్ని రద్దు చేయాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉదయ్ కిరణ్ అన్నారు సోమవారం రాయచోటి టౌన్ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ్ అధ్యక్షతన జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉదయ్ కిరణ్ హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న కాంపెయిన్ లో భాగంగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కూడా ఈ క్యాంపియన్ జరపాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిదినాల్ని 200 రోజులకు, రోజు వేతనాన్ని రూ 600 లకు పెంచాలనీ, అవకతవకల్ని సరిచేసి పటిష్టంగా అమలు చేయాలని గ్రామీణ కార్మికులు ఒకపక్క కోరుతుంటే ఉన్న పథకాన్నే నీరుగార్చేందుకు మోడి ప్రభుత్వం విబి గ్రామ్ జీ పథకాన్ని తీసుకొస్తుందనీ, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు 2005 లో పేదల ఆకలి తీర్చటానికి తీసుకొచ్చిన పథకం ద్వారా లక్షలాది పేద ప్రజలకు ఉపాధి హక్కుగా దొరుకుతుంది అనీ, అయితే కేంద్ర ప్రభుత్వం పేరు మార్పు చేస్తూ మోసపూరితంగా హామీని తొలగిస్తోందని ఆయన తెలిపారు ఉపాదా హామీ చట్టాన్ని 200 రోజులు పని దినాలు కల్పించాలని అలాగే ప్రతి కూలీకి 700 రూపాయలు ఇవ్వాలని కోరారు ఉపాధి కూలీలకు షా మీద టెంట్లు వేసి మజ్జిగ వాటర్ ప్యాకెట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి తీర్చాలని ఆయన అన్నారు పేదల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం తీరును ఆయన ఎండగట్టారు రాష్ట్ర ప్రభుత్వం నిసుగ్గుగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు తలాడిస్తూ ఉండటం ఈ కూటమి ప్రభుత్వం చేతకానితనానికి నిదర్శనం అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్ )లిబరేషన్ పార్టీ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాధ జిల్లా కమిటీ సభ్యులు రమణ ఆంజనేయులు చలపతి మహిళా సంఘం జిల్లా నాయకురాలు మేకల సుజాత పెద్దన్న మాధవరం గ్రామ ఇన్చార్జ్ మల్లికార్జున నాయుడు ఏఐఎస్ఏ నాయకులు ఎం సతీష్ కుమార్ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు

## కడపలో ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాల జేపసీ ఏర్పాటు



**కడప, ప్రజాజ్యోతి జూలై 6**: కడప నగరంలోని ఆర్‌డబీ బంగ్లాలో ఎంఆర్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మందకృష్ణ వర్గం, బ్రహ్మయ్య వర్గం, పేరుపోగు వెంకటేశ్వరరావు వర్గం, దండు వీరయ్య వర్గం, బుంగ సంజయ్ మాదిగ వర్గం, సువర్ణ రాజు వర్గం తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొని సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ)ను ఏర్పాటు చేశారు.జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో కార్యాచరణ కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించి ఏకగ్రీవంగా ఆమోదించారు. జేఏసీ అధ్యక్షుడిగా పెద్దలపల్లె ఓబులపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. కుమార్, సలహాదారుగా పి. సుబ్బారాయుడు, ఉపాధ్యక్షుడిగా ఎం. సుబ్బారాయుడు, ప్రధాన కార్యదర్శిగా కేశరయ్య, ప్రచార కార్యదర్శిగా పచ్చారం బాలసుబ్బయ్య, కార్యదర్శులుగా పి. ఆంజనేయులు, జి.వి. రమణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు పెద్దలపల్లె ఓబులపతి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా మాదిగ ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. అలాగే బాలాజీ నగర్‌లోని చర్మకారుల స్థలాలను మాదిగ కుటుంబాలకే ఇంటి స్థలాల పట్టాలు అందేలా ఉద్యమం చేపడతామని పేర్కొన్నారు. అదేవిధంగా బాబు జగ్జీవన్ రామ్ భవనం, స్మృతి వనం ఏర్పాటు కోసం కూడా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీమాంధ్ర దళిత ప్రజా సేన రాష్ట్ర అధ్యక్షుడు పి. ఓబులపతి, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కె. మాతయ్య బాబు, మహా ఎంఆర్పీఎస్ నాయకులు సుబ్బారాయుడు, ఎంఆర్పీఎస్ రాష్ట్ర నాయకులు తప్పెట హరిబాబు, పచ్చారం బాలసుబ్బయ్య, పెద్దలపల్లె మల్లీఖార్జున, కేశవయ్య, మాతంగి చిన్న సుబ్బారాయుడు, జి.వి. రమణ, పాల్లెం భరత్, కమ్మటి నాగేంద్ర, ఎం. వెంకటరమణ, మైదుకూరుకు చెందిన కొట్లపాటి సతీష్, కె. మల్లేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు



**హోళగుంద, జూలై 6, ప్రజా జ్యోతి న్యూస్ –** హోళగుంద మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈ.ఎన్. ప్రసాద్, చిదానంద ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. దేశానికి శ్యాంప్రసాద్ ముఖర్జీ చేసిన సేవలను వారు ఈ సందర్భంగా కొనియాడారు.

**నాయకుల ప్రసంగ ముఖ్యాంశాలు:**

జాతీయవాద నేత: 1901 జూలై 6న జన్మించిన డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ దేశంలోని ప్రముఖ జాతీయవాద నేతలలో అత్యంత ముఖ్యమైన వ్యక్తి. ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు.జనసంఘ్ స్థాపన: హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సభ్యుడైన ఆయన, 1951లో 'భారతీయ జనసంఘ్' పార్టీని స్థాపించారు. దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా ఆయన చరిత్రలో నిలిచిపోయారు.నేపథ్యం – విద్యాభ్యాసం: కలకత్తా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ (కులపతి)గా పనిచేసిన అశుతోష్ ముఖర్జీ కుమారుడైన శ్యాంప్రసాద్ ముఖర్జీ, కోల్‌కతాలోనే ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. ప్రారంభంలో కాంగ్రెస్ వాదిగానే ఆయన తన రాజకీయ జీవితాన్ని ఆరంభించారు.కేంద్ర మంత్రిగా సేవలు: దేశ స్వాతంత్ర్యానికి పూర్వం జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వంలో ఆయన పరిశ్రమల శాఖ మంత్రిగా దేశానికి విశేష సేవలు అందించారు.కాంగ్రెస్‌కు రాజీనామా: 1949లో జరిగిన 'ఢిల్లీ ఒప్పందానికి' వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలతో విభేదించి, ఆ పార్టీ నుంచి బయటకు వచ్చారు. అనంతరం 1951లో జనసంఘ్ పార్టీని ఏర్పాటు చేసి దేశ రాజకీయాల్లో సరికొత్త పంథాకు నాంది పలికారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంజాయికి గుడ్‌బై.. సైబర్ నేరాలకు చెక్..! డొంకరాయిలోపోలీసుల అవగాహన గర్జన”









**రోడ్డు భద్రత, మహిళల రక్షణ, సైబర్ మోసాలపై గ్రామస్తులకు కీలక సూచనలు చేసిన సీఐ గోపాలకృష్ణ**
**-- ఎస్సై చరణ్ నాయక్**

**మోతుగూడెం జులై 6 ప్రజా జ్యోతి** డొంకరాయి, జూలై 6: డొంకరాయి గ్రామంలోని హాస్పిటల్ క్యాంప్‌లో చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, డొంకరాయి ఎస్సై చరణ్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు.మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.సైబర్ నేరాలపై మాట్లాడుతూ, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు.ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టడం సాధ్యమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పోలీసులు పిలుపునిచ్చారు

## మండల పర్యావరణ కమిటీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధంపై మండల కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ



**కార్యక్రమం లోపాల్గొన్న పర్యావరణ కమిటీ. ప్రజలు. విద్యార్థులు.**

**అనంతగిరి మండలం. జులై 6. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరిమండలం. అనంతగిరి మండల కేంద్రంలో సోమవారం నాడు మండల పర్యవన కమిటీ నాయకులు చిట్టం మురళి. వంజరపు శంకరరావు లఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో ప్లాస్టిక్ నిషేధం పై భారీ అవగాహన ర్యాలీ కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమం కొత్తవలస గిరిజన బాలుర పాఠశాల ప్రధాన రహదారి నుండి మొదలుకొని అనంతగిరి గ్రామ ప్రధాన రహదారి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో మండల పర్యావరణ కమిటీ సభ్యులు.విద్యార్థులు. వ్యాపారవేత్తలు. వివిధ వర్గాలకు చెందిన ఉద్యోగులు. పర్యాటకులు స్థానిక ప్రజలు పాల్గొని ప్లాస్టిక్ ని నిషేదిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం. ప్లాస్టిక్ వాడకం వద్దు. ఆరోగ్యమే ముద్దు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై ర్యాలీలో భారీ నినాదాలు చేశారు. అనంతగిరి సంత బయలు ప్రదేశంలో ప్రదేశంలో మానవహారంలో ఏర్పడి మానవహారంగా ఏర్పడి అనేక నినాదాలు చేస్తూ ప్లాస్టిక్ వాడకం వలన ఎటువంటి అనర్ధాలు కలుగుతాయో పర్యావరణ కమిటీ నాయకుడు మురళి ప్రజలకు. ప్రజలు వివరించారు. అనంతరం మురళి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం ఇలానే కొనసాగితే రానున్న రోజులలో గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురి కావలసిన పరిస్థితి ఏర్పడుతుందని ఇప్పటికే ప్లాస్టిక్ వాడకం వల్ల గిరిజన ప్రజలు వివిధ రకాల వ్యాధులు సోకి మరణించిన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్లాస్టిక్ బాటిల్ లో నీరు త్రాగి బయట విసిరివేయడం జరుగుతుందని మరల అదే బాటిల్ ను అనేక విధాలుగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారని తద్వారా వ్యాధులు సోకుతున్నాయని ఈ విషయం ప్రజలు గమనించలేకపోతున్నారని గుర్తు చేశారు. గతంలో అవగాహన ర్యాలీ కార్యక్రమాలు చేపట్టినప్పటికీ ప్రజలు పెడచెవిన పెడుతున్నారని కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఉన్నాయని అయినప్పటికీ గిరిజన ప్రాంత ప్రజల్లో మార్పు కనిపించలేదని ఇకనుండి గిరిజన ప్రాంతం ప్రజలు చైతన్యవంతులై ప్లాస్టిక్ నిషేధం పై పూర్తిగా పోరాటం కొనసాగించి ఒక ఉద్యమంలో ముందుకెళ్లవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సూచించారు. ఈ విషయం ప్రజలు గమనించి ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. కార్యక్రమానికి పర్యావరణ మండల కమిటీ సభ్యులు మంగళ. నవీన్. బంజో. రవి. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## పాత్రికేయుల ఐక్యతతోనే హక్కుల సాధన

**ఐ ఎఫ్ డబ్ల్యూ జె జిల్లా కార్యవర్గం ఎన్నిక**





**శంఖవరం, జులై 6 (ప్రజాజ్యోతి న్యూస్)** పాత్రికేయుల వృత్తి గౌరవాన్ని కాపాడుతూ వారి హక్కుల సాధన, సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేయాలనే సంకల్పంతో ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీఎఫ్‌డబ్ల్యూజే) రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలోని వర్తక సంఘం కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.ఈ సమావేశానికి సీనియర్ పాత్రికేయులు పడాల నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షులు ఎన్. ఈశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. అప్పలస్వామి, రీజినల్ కన్వీనర్ ఎం.వి. మల్లేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.సమావేశంలో రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయులు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, వారికి తగిన భద్రత, సంక్షేమం, ప్రభుత్వ గుర్తింపు వంటి అంశాల్లో ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటి పరిష్కారం కోసం సంఘం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాత్మకంగా పనిచేస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యండమూరి వెంకట్రావు (బాబీ), ఉపాధ్యక్షుడిగా గునపర్తి అపురూప్, ప్రధాన కార్యదర్శిగా సకిరెడ్డి గోవిందరావు, సహాయ కార్యదర్శిగా డి. సూర్య, కోశాధికారిగా ఎన్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు.నూతన అధ్యక్షుడు యండమూరి వెంకట్రావు (బాబీ) మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి పాత్రికేయుడి సమస్యను సంఘం సమస్యగా భావించి పరిష్కారం కోసం ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసి, యువ పాత్రికేయులకు శిక్షణ, సభ్యుల సంక్షేమం, అత్యవసర సహాయ నిధి, మీడియా స్వేచ్ఛ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను రాష్ట్ర నాయకులు, సీనియర్ పాత్రికేయులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాత్రికేయులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాత్రికేయులు బి రామారావు, పి శ్రీను, యు శివ దుర్గ, బి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మత్తుపదార్థాల వినియోగం, రోడ్డు భద్రత, ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం





**రాయచోటి జూలై 06 ప్రజా జ్యోతి** అన్నమయ్య జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం మత్తుపదార్థాల వినియోగ నివారణ, రోడ్డు భద్రత, ర్యాగింగ్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి ట్రాఫిక్ విభాగపు సీఐ పి.వి. సుధాకర్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.సీనియర్, జూనియర్ విద్యార్థులు పరస్పరం స్నేహభావంతో మెలగాలని, ర్యాగింగ్‌కు పూర్తిగా దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని, విద్యాభ్యాసంతో పాటు భవిష్యత్తు ఉద్యోగ అవకాశాలపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.యువత గంజాయి, కొకైన్, హెరాయిన్, గుట్కా, పొగాకు, మద్యం వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, వాటి వల్ల శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మత్తుపదార్థాల వినియోగం రోడ్డు ప్రమాదాలు, నేరాలు, కుటుంబ సమస్యలకు ప్రధాన కారణంగా మారుతుందని వివరించారు.ర్యాగింగ్ నిరోధక చట్టం ప్రకారం నేరం రుజువైతే ఆరు నెలల నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు రూ.5,000 నుంచి రూ.50,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు. కళాశాల ప్రాంగణంలో ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై దృశ్యరూపంలో అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ర్యాగింగ్ అనే విష సంస్కృతిని ప్రతి విద్యార్థి బహిష్కరించి క్రమశిక్షణతో విద్యలో రాణించాలని పిలుపునిచ్చారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.ట్రాఫిక్ ఎస్సై ఎన్. శేఖర్ మాట్లాడుతూ మత్తుపదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి విద్యార్థి బాధ్యతగా కృషి చేయాలని కోరారు. ప్రతి విద్యార్థి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.కార్యక్రమం ముగింపులో విద్యార్థుల తో ర్యాగింగ్, మత్తుపదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. వెంకటరమణ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఏ. నరేష్, మేనేజ్‌మెంట్ ప్లేస్‌మెంట్స్ విభాగాధిపతి డాక్టర్ కె. ఇంతియాజ్, ఏఐ డీఎస్ విభాగాధిపతి పి. సుబహాన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి. ప్రతాప్ రావు, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి. శ్రావణ్ కుమార్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి బి. సౌజన్య, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఏ. కరుణాకర్, బేసిక్ సైన్సెస్ ఉ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ. రాజేష్, పోలీసు సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాగవంశం కళ్యాణ మండపం నిర్మాణానికి ముందడుగు

- నిర్మాణానికి తమ వంతు సహకారంగా ఆర్థిక సహాయం అందజేసిన దాతలు
- ఆర్థిక సహాయం అందజేసిన దాతలను ఘనంగా సత్కరించిన రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు
- సామాజిక వర్గ అభివృద్ధి , సంక్షేమమే లక్ష్యం
- నాగవంశం జాతి అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలి : చైర్మెన్ రమణారావు





**విజయవాడ , ప్రజాజ్యోతి న్యూస్:**విజయవాడ లో నిర్మాణం లో ఉన్న నాగవంశం కళ్యాణ మండపం నిర్మాణానికి పలువురు దాతలు ఉదారంగా ఆర్థిక సహాయం అందజేశారు. విజయవాడ వాస్తవ్యులు డొకర అప్పన్న ముఠా మేస్త్రి రూ. 93 వేల విలువగల టన్నున్నర ఐరన్ ,వైయస్సార్ కాలనీ (స్వగ్రామం డొకరపేట), కాళ్ళ రమణ (స్వగ్రామం దాకమర్రి), డొకర శ్రీనివాస్ బ్రదర్స్ - గాంధీనగర తమ వంతు విరాళంగా చెరొక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నాగవంశం కార్పొరేషన్ చైర్మన్ ఎరుబోతు రమణారావు ఎన్టీఆర్ జిల్లా నాగవంశం కమిటీ అధ్యక్షుడు బెవర రాము, సెక్రటరీ తమ్మిన గణేష్, కోశాధికారి కాళ్ళ సత్యం,కమిటీ సభ్యుల సమక్షంలో దాతలను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.అనంతరం చైర్మన్ ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ రోజువారీ కష్టపడి జీవనం సాగించే ఒక ముఠా కార్మికుడు డొకర అప్పన్న చిరు వ్యాపారులు అయినట్టివంటి కాళ్ళ రమణ, డొకర శ్రీనివాస్ బ్రదర్స్ సంఘ శ్రేయస్సు కోసం ఇంత పెద్ద మొత్తంలో విరాళం అందించడం ఎంతో ఆదర్శప్రాయమైన విషయమని తెలిపారు.వారి స్ఫూర్తితో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉన్న నాగవంశీయులు ఐక్యంగా ముందుకు వచ్చి విజయవాడ నాగవంశం కల్యాణ మండప నిర్మాణానికి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించి ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చేయాలని పిలుపునిచ్చారు. నాగవంశం సామాజిక వర్గ అభివృద్ధికి , శ్రేయస్సుకు ప్రతీ ఒక్కరూ సహకారం అందించాలన్నారు. సామాజిక వర్గం అభివృద్ధి చెందితే భవిష్యత్ తరాల వారికి మంచి భవిష్యత్ అందించినవారం అవుతామని పేర్కొన్నారు. కళ్యాణ మండపం నిర్మాణం పూర్తి అయిన తర్వాత సామాజిక సాంస్కృతిక శుభకార్యాల నిర్వాహణకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతీ ఒక్క నియోజకవర్గంలో నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లను, సంక్షేమ సంఘం సభ్యులను సమన్వయం చేసుకుంటూ ఆయా నియోజకవర్గ ప్రతినిధుల సహకారంతో నాగవంశం కళ్యాణ మండపం నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎరుబోతు కనకరావు (నిర్మాణ కమిటీ సభ్యుడు),తాలాడ సూర్యనారాయణ, కర్రోతు గురునాయుడు, రామ్ సింగ్ కోటేశ్వరరావు, కంటుభుక్త ఆదిబాబు, అనకాపల్లి రాంబాబు,సతీష్, కండుబోతు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే వేతనాలు చెల్లించాలి

**మహిళా ఉద్యోగులందరికీ మెటర్నిటి లీవులు ఇవ్వాలి విద్యుత్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే నడపాలి**

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గౌరీ శంకర్**



**మదనపల్లె జూలై 06 ప్రజా జ్యోతి** రాష్ట్రంలో ఆర్టీసీలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే ప్రతినెల వేతనాలు చెల్లించాలని, మహిళా ఉద్యోగులకు మెటర్నటి లీవులు ఇవ్వాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ ,ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గౌరీ శంకర్ ప్రభుత్వాన్ని కోరారు.ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఔట్సోర్సింగ్ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 8,000 మంది కార్మికులు ఆర్టీసీ వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని, వారికి చెల్లించే వేతనాలు ఆర్టీసీ ద్వారానే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో థర్డ్ పార్టీ, కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేయాలని కోరారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ ఆసుపత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించాలని, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఆర్టీసీ గుర్తింపు కార్డులు మంజూరు చేసి, డ్యూటీలకు వచ్చేవారికి ఆర్టీసీ బస్సులో ఉచిత సౌకర్యం కల్పించాలని కోరారు.వారాంతపు సెలవులు తోపాటు జాతీయ సెలవులు, రాష్ట్ర సెలవులు సౌకర్యం కల్పించాలని కోరారు విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన వారికి మెనేజ్ మెంట్ ద్వారా ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తీసుకున్న విద్యుత్ బస్సులను ప్రైవేటు ఆపరేటర్లతో కాకుండా ఆర్టీసీ యాజమాన్యం ద్వారానే నడపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు గజపతి,రమణప్ప,శివ ప్రసాద్, మల్లి ఖార్జున తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన జనసేన ఇన్‌ఛార్జ్ పేడాడ రామ్మోహన్ రావు



**ఆమదాలవలస::::** ప్రజాజ్యోతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆమదాలవలస నియోజకవర్గం, కత్యాచార్యుల పేట గ్రామానికి చెందిన జనసైనికుడు తమ్మినేని జగదీష్‌ను నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ పేడాడ రామ్మోహన్ రావు సోమవారం పరామర్శించారు. జగదీష్ నివాసానికి వెళ్లిన ఆయన, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలను అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా పేడాడ రామ్మోహన్ రావు మాట్లాడుతూ... జగదీష్‌కు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం (యాక్టివ్ మెంబర్‌షిప్) ఉన్నందున, పార్టీ తరపున లభించే ప్రమాద బీమా సొమ్ము త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ ఎల్లప్పుడూ క్రియాశీలక కార్యకర్తలకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేడాడ నర్సింగరావు, శిర్లపు గణేష్, మజ్జి రాంబాబు, పొట్నూరు ప్రసాద్ రావు మరియు స్థానిక కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఎటపాక ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

**1 మెయిన్, 1 మినీ కార్యకర్తతో పాటు 29 సహాయకురాల పోస్టుల భర్తీ**

**ఈ నెల 20 వరకు దరఖాస్తులకు గడువు**

**సీడీపీఓ కార్యాలయంలో పూర్తి వివరాలు**




**ఎటపాక, జూలై 6 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండల పరిధిలోని నిరుద్యోగ మహిళలకు శుభవార్త. ఎటపాక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సోమవారం అధికారిక నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఐసీడీఎస్ అధికారులు వివరాలు వెల్లడించారు. నోటిఫికేషన్ ప్రకారం మండల వ్యాప్తంగా మొత్తం 1 మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త, 1 మినీ అంగన్‌వాడీ కార్యకర్త, 29 అంగన్‌వాడీ సహాయకురాలు (హెల్పర్) పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు అవసరమైన అన్ని ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులను పూర్తి చేసి స్థానిక సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలని అధికారులు సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 20 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. గడువు అనంతరం అందిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. విద్యార్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్ నిబంధనలు, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాల కోసం ఎటపాక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు కోరారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నూతన ఉప తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ

**దువ్వూరు,జులై 06 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు మండల డిప్యూటీ తహసీల్దారుగా నాగ స్వరూప్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈయన ఒంటిమిట్ట రీ సర్వే డిప్యూటీ తహసీల్దారుగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు

## మురికి కాలువను పరిశీలించిన డిఎల్ డిఓ రామాంజినేయులు





**దువ్వూరు,జులై 06 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు మండల కేంద్రంలో మురికి కాలువను డిఎల్ డిఓ రామాంజినేయులు సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా డిఎల్ డిఓ సమావేశం నిర్వహించారు.డ్రైనేజీ సమస్యపై సూచనలు ఇచ్చారు.ఆర్ అండ్ బి రహదారి హద్దులు చూపాలని తహసీల్దార్ సునీత ను తెలియజేశారు. అనంతరం పూడిక తీత పనులు చేపట్టి,అక్రమ నిర్మాణాలు తొలిగించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బారెడ్డి,డిప్యూటీ ఎంపీడీఓ హరికృష్ణ,ఏపీఓ లక్ష్మి నారాయణ, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## పెద్దసీది జడ్.పీ. హైస్కూల్ ప్రహరీ గోడను ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎమ్మెల్యే ఎంజీఆర్.



**ప్రజాజ్యోతి రిపోర్టర్ :-**యం. నరేష్. శ్రీకాకుళం పాతపట్నం ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ 36.00 లక్షలు నిధులతో నిర్మించిన ప్రహరీ గోడ విద్యార్థుల భద్రతకు దోహదం.పాతపట్నం మండలం పెద్దసీది జడ్.పీ. హైస్కూల్‌లో రూ.36.00 లక్షల ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్ నిధులతో నిర్మించిన ప్రహరీ గోడను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రివర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు , పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని తెలిపారు.విద్యార్థులకు సురక్షితమైన విద్యా వాతావరణాన్ని కల్పించే దిశగా ప్రహరీ గోడ నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్ కోసం అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గారు మరియు ఆర్డీవో గారు,ఐదు మండలాల ఎన్డీఏ కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

## భోగేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించిన జనసైనికులు

**ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో సుబ్బు** అనంతపురం పార్లమెంటు జనసేన పార్టీ అబ్జర్వర్ అజయ్ కుమార్ ని సోమవారం పామిడి మండల జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పురాతన దేవాలయం శ్రీ భోగేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించి సన్మానించారు అనంతపురం పార్లమెంట్ అబ్జర్వర్ అజయ్ కుమార్ భోగేశ్వర స్వామి చరిత్రను అడిగి తెలుసుకున్నారు ఎందుకంటే రాష్ట్రంలోనే గాక తెలంగాణలో కూడా శ్రీ భోగేశ్వర స్వామి భక్తాదులు వస్తుంటారని గతంలో చాలామంది జనసేన సైనికులు చెప్పేవారు మరల దేవుడు అవకాశం కల్పిస్తే కూటమి ప్రభుత్వం 2029లో అధికారంలోకి వచ్చిన తర్వాత భోగేశ్వర స్వామిని దర్శించుకుంటానని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తీసి వరుణ్ స్వచ్ఛ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్ భవాని రవికుమార్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాం రెడ్డి గుంతకల్ ఇన్చార్జి వాసగిరి మణికంఠ భోగేశ్వర స్వామి డైరెక్టర్ వడ్డే రాము కత్రిమల సుబ్బు, ఖాజావలి, జమీర్, సూర్య,లక్ష్మణ్ ,రవి,తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పద్మావతి ఆర్ట్స్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది



**నంద్యాల:జులై=6 ప్రజాజ్యోతి** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్నటువంటి రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని పేద మధ్యతరగతి విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేయడం జరిగింది ప్రస్తుతం జరిగిన ధరలకు అనుకూలంగా బిసి, యస్ సి విడుదల చేయా యస్ టిసంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ కనీసం 3వేల రూపాయలు పెంచాలని విద్యార్థులకు నష్టం కలిగించే ఎఫ్ ఆర్ ఎస్ విధానాన్ని రద్దు చేయాలని

## మాంటిస్సోరి స్కూల్లో ఘనంగా స్కూల్ పీపుల్ లీడర్ ఎన్నిక నిర్వహణ



**తాళ్లపూడి, జూలై 6, ప్రజాజ్యోతి న్యూస్** విద్యార్థులకు ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్య ఎన్నికల విధానం గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో తాళ్లపూడి మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సోమవారం స్టూడెంట్ పీపుల్ లీడర్ (ఎస్‌పీఎల్) ఎన్నికలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరెస్పాండెంట్ వి.వి. అనీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికలకు ఎడ్యుకేషన్ కోసం రూపొందించిన ప్రత్యేక ఎన్నికల సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించారు. నిజమైన ఎన్నికల ప్రక్రియను పోలి ఉండే విధంగా ఓటింగ్ నిర్వహించడంతో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం పోటీలో ఎస్ పి ఎల్ అభ్యర్థులుగా పది మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలో బాలికలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన నాయకత్వాన్ని ఎన్నుకునే విధానం గురించి వివరించారు. అనంతరం ఓట్ల లెక్కింపు పూర్తి చేసి విజేతలను ప్రకటించి ఎస్‌పీఎల్‌గా ఎంపిక చేశారు.పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, భాధ్యతాయుతమైన పౌరస్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు

# మా ఊరికి బస్సు వేయండి సారూ..!

**కవలకుంట్ల యస్. సి కాలనీ ప్రజల ఆవేదన.**



**పోరుమామిళ్ల జులై 06(ప్రజా జ్యోతి ప్రతినిధి)**కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కవలకుంట్ల గ్రామ ప్రజలను ఆటో నిర్వాహకులు ఛార్జీల పేరుతో నిలువుదోపిడీ చేయడమే కాకుండా, ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగడంపై స్థానికంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం 11 కిలోమీటర్ల దూరమున్న కవలకుంట్ల నుండి పోరుమామిళ్ళకు గతంలో రూ. 10 ఉన్న ఛార్జీని ఏకంగా రూ. 30 కి పెంచేసి, "దిక్కున్న చోట చెప్పుకోండి" అంటూ ఆటోల వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తక్షణమే స్పందించి అక్రమ ఆటోలను బంద్ చేయించాలని, సామాన్యులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వ బస్సులను పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.పెరిగిన ఛార్జీలతో సామాన్యుల కష్టాలు వర్ణనాతీతం. గతంలో రూ. 10 ఉన్న ఛార్జీని రూ. 30 కి పెంచడంతో పేద, మధ్యతరగతి ప్రజల జేబులకు చిల్లు పడుతోందన్నారు.నిత్యం కూలీ పనులకు వెళ్లేవారు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు, ఆసుపత్రి పనుల నిమిత్తం రోజువారీగా పోరుమామిళ్ళకు వెళ్లేవారు ఈ పెరిగిన ఛార్జీలతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. రేట్లు ఎందుకు పెంచారని ప్రశ్నించిన ప్రయాణికులపై ఆటో డ్రైవర్లు దురుసుగా ప్రవర్తిస్తూ, దిక్కున్న చోట చెప్పుకోమంటూ సవాళు విసురుతున్నారు.ఆటోల పర్మిషన్లపై విచారణ జరిపి అక్రమ వాహనాలను నిషేదించాలని ఈ మార్గంలో నడుస్తున్న ఆటోల వల్ల ప్రయాణికులకు రక్షణ కరువైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అసలు ఈ మార్గంలో తిరుగుతున్న ఆటోలకు సరైన ప్రభుత్వ పర్మిషన్లు, రవాణా శాఖ, ఫిట్నెస్ సర్టిఫికెట్లు, ఇన్సూరెన్స్ మరియు డ్రైవింగ్ లైసెన్సులు ఉన్నాయా లేదా అని అధికారులు సమగ్ర విచారణ జరపాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ, ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తూ, అడ్డగోలు ఛార్జీలు వసూలు చేస్తున్న ఆటోలను ఈ మార్గంలో పూర్తిగా బంద్ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ఆర్టీసీ బస్సులు నడపాలని ఆటోల దౌర్జన్యానికి శాశ్వత పరిష్కారం కేవలం ప్రభుత్వ రవాణా వ్యవస్థతోనే సాధ్యమని కవలకుంట్ల గ్రామ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.కవలకుంట్ల నుండి పోరుమామిళ్ళకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులను నడపాలని దీనివల్ల విద్యార్థులకు, ఉద్యోగులకు, వ్యాపారులకు ఎంతో సురక్షితమైన మరియు చౌకైన రవాణా అందుబాటులోకి వస్తుందన్నారు.మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటు ఉంటుందన్నారు.ప్రభుత్వ బస్సులు అందుబాటులోకి వస్తే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కలుగుతుందని రవాణా శాఖ, పోలీస్ అధికారులు మరియు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉమ్మడిగా స్పందించి కవలకుంట్ల గ్రామ ప్రజలకు శాశ్వత న్యాయం చేయాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

# కూనవరం ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల






1 మెయిన్, 1 మినీ కార్యకర్తతో పాటు
33 సహాయకురాల పోస్టుల భర్తీ
ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు
వివరాలు వెల్లడించిన ఐసీడీఎస్ అధికారులు

**కూనవరం, జూలై 6 (ప్రజాజ్యోతి):**కూనవరం మండల పరిధిలోని నిరుద్యోగ మహిళలకు ఐసీడీఎస్ అధికారులు శుభవార్త అందించారు. కూనవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సోమవారం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ ప్రకారం మండల పరిధిలో మొత్తం 1 మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త, 1 మినీ అంగన్‌వాడీ కార్యకర్త, 33 అంగన్‌వాడీ సహాయకురాలు (హెల్పర్) పోస్టులను భర్తీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను పూర్తి చేసి స్థానిక సీడీపీఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 20 సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్ణయించినట్లు వెల్లడించారు. గడువు అనంతరం వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం, రిజర్వేషన్ నిబంధనలు తదితర పూర్తి వివరాల కోసం కూనవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని సంప్రదించాలని అధికారులు కోరారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు.

# ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని అన్నవరంలో ప్రత్యేక పూజలు



**శంఖవరం. జులై 6 (ప్రజా జ్యోతి న్యూస్)** మాజీ మంత్రివర్యులు, మాజీ పార్లమెంటు సభ్యులు ముద్రగడ పద్మనాభం సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాజీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ అన్నవరం గ్రామ సర్పంచ్ శెట్టి బత్తుల కుమార్ రాజా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి తొలి పావంచ (తొలి మెట్టు) వద్ద కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించి, ముద్రగడ పద్మనాభం గారు త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని ప్రజాసేవలో తిరిగి పాల్గొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శెట్టి బత్తుల కుమార్ రాజా మాట్లాడుతూ, ప్రజల కోసం నిరంతరం పోరాడే ముద్రగడ పద్మనాభం వంటి నిబద్ధత కలిగిన నాయకులు రాజకీయాల్లో ఉండటం సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు రావాలని సత్యనారాయణ స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. మండల కన్వీనర్ నరాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, నీతి, నిజాయితీ, ప్రజాసేవకు మారుపేరుగా నిలిచిన ముద్రగడ పద్మనాభం గారికి భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలని, రాష్ట్ర ప్రజలకు ఆయన సేవలు మరింత కాలం అందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడపా సోమేష్, సకురు గుర్రాజు, సరమర్ల మధు, ఆసిన శ్రీను, బొబ్బిలి వెంకన్న, ఎంపీటీసీ సభ్యులు చల్లా ప్రసాద్, సొప్ప రాంబాబు, జిలకర విష్ణు, జిలకర లక్ష్మణ్ తో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నంద్యాల పట్టణ ప్రజలకు అడిషనల్ ఎస్పీ ఎం. జావళి ఆల్ఫోన్స్ గారి విజ్ఞప్తి:

**ఎల్ ఎచ్ ఎం యస్ యాప్‌తో మీ ఇంటికి రక్షణ**

**నంద్యాల:జులై =6 ప్రజాజ్యోతి** దొంగతనాలకు అవకాశం లేకుండా పోలీస్ వారు ప్రవేశపెట్టిన ఎల్ ఎచ్.ఎం యస్ సేవలు ప్రజలు వినియోగించుకోండి....నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షోరాణ్ ఐపిఎస్ గారి ఆదేశాలమేరకు, పట్టణంలో దొంగతనాల నివారణకు మరియు ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేందుకు 'లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ ఎల్ఎచ్ ఎంయస్ అనే పోలీసు వారి సేవను ప్రజలు వినియోగించు కోవాలని నంద్యాల సబ్ డివిజన్‌లో ప్రారంభిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ కుమారి ఎం. జావళి ఆల్ఫోన్స్, ఐపిఎస్ ప్రకటించారు.ఈ సందర్భంగా నంద్యాల సబ్ డివిజన్ అడిషనల్ ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్లే సమయంలో దొంగతనాలకు అవకాశం లేకుండా ఈ వ్యవస్థ పనిచేస్తుందని వివరించారు.

**ఎల్ ఎచ్ ఎం యస్ యాప్ వినియోగం మరియు ప్రయోజనాలు: యాప్ డౌన్లోడ్:**
ప్రజలు గూగుల్ ప్లే స్టోర్ నుండి 'ఎల్ ఎచ్ యం యస్ ఎపి పోలీస్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని తమ వివరాలను నమోదు చేసుకోవాలి.

**రిక్వెస్ట్ పంపడం:**
మీరు ఇల్లు వదిలి బయటకు వెళ్లేటప్పుడు, ఏ తేదీ నుండి ఏ తేదీ వరకు ఇంటికి తాళం వేసి ఉంటుందో యాప్ ద్వారా 'వాచ్ రిక్వెస్ట్' పంపాలి.

**సిసిటివి ఏర్పాటు:**
మీ రిక్వెస్ట్ అందిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ నుండి సిబ్బంది మిమ్మల్ని సంప్రదించి, మీ ఇంటి వద్ద ఉచితంగా అధునాతన సిసిటివి కెమెరాను ఏర్పాటు చేస్తారు.

**లైవ్ మానిటరింగ్:**
ఈ కెమెరాలు మోషన్ డిటెక్షన్ సెన్సార్లతో పనిచేస్తాయి. ఇంటి వద్ద ఏ చిన్న అలజడి జరిగిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వెళ్తుంది, తద్వారా పోలీసులు తక్షణమే స్పందించి దొంగతనాలను అరికడతారు.**వాట్సాప్ ద్వారా రిక్వెస్ట్:** యాప్




అందుబాటులో లేని వారు పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నంబర్ 9154877890 కు సమాచారం అందించవచ్చు. అలాగే 'మనమిత్ర' వాట్సాప్ నంబర్ 9552300009 ద్వారా కూడా రిక్వెస్ట్ పంపవచ్చు.

**ముఖ్య సూచనలు:**
ప్రస్తుతం మా వద్ద పరిమిత సంఖ్యలో కెమెరాలు ఉన్నందున, ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడు తుంది.ప్రజలు తమ ఇళ్ల వద్ద సొంతంగా సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని మరియు వీలైతే తలుపులకు మోషన్ సెన్సార్ అలారమ్స్ అమర్చుకోవాలని సూచించారు. బయట ఊళ్లకు వెళ్లేటప్పుడు విలువైన నగలు, నగదును ఇంట్లో ఉంచ కుండా నమ్మకస్తుల వద్ద లేదా బ్యాంకు లాకర్లలో ఉంచుకోవా లని కోరారు.నంద్యాల పట్టణ మరియు శివారు ప్రాంతాల ప్రజలందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని పోలీసులకు సహకరించాలని అడిషనల్ ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## భక్తి భావంతో శివాలయంలో అన్నదాన సేవ

**బుట్టాయిగూడెం శివాలయంలో ప్రతి సోమవారం అన్నప్రసాద వితరణ**

**భక్తుల సహకారంతో సేవా కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తాం: ఆలయ కమిటీ**



**ఎటపాక, జూలై 6 (ప్రజాజ్యోతి):** ఎటపాక మండలం బుట్టాయిగూడెం గ్రామంలోని శివాలయంలో సోమవారం భక్తి శ్రద్ధల మధ్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సోమవారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం కూనవరం మండలం గొమ్ముఅయ్యవారిగూడెం గ్రామానికి చెందిన దన్నూరి వెంకట సత్యనారాయణ, శ్రీలక్ష్మి, అచ్యుత కావ్య కుటుంబ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగించనున్నట్లు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుసుమరాజు సురేష్, కిలారు రాజశేఖర్, అరవ కామేశ్వరరావు, సరియం బుజ్జి, పులుసు కోటేశ్వరరావుతో పాటు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం,

**నద్యాల సిరివెళ్ల, జూలై, 6,** ప్రజాజ్యోతి సిరివెళ్ల మండలంలో గల కోటపాడు గ్రామంలోని మండల పరిషత్ పాఠశాల ప్రాంగణంలో దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిన్నారుల కు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి పూజారి ప్రసాద్ శర్మ హాజరై చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు,ప్రత్యేక పూజలు, సంప్రదాయ ఆచారాల మధ్య అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ నంద్యాల జిల్లా ధర్మ ప్రచారక్ నాగమల్లేశ్వర్ రెడ్డి తెలిపారు.సరస్వతీ దేవికి విశేష పూజలు నిర్వహించి,అనంతరం చిన్నారులకు దానధర్మా చారిటబుల్ ట్రస్ట్ మరియు వేద సంకల్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో 40 మంది చిన్నారులకు పలకలు,బలపాలు అందజేసి అక్షరాభ్యాసం నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. తదనంతరం స్కూల్లోని విద్యార్థిని విద్యార్థులందరికీ స్వీట్లతోపాటు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పూజారి ప్రసాద్ శర్మ మాట్లాడుతూ ప్రతి చిన్నారి చదువులో రాణించి, ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బాల నాగమణి,ఉపాధ్యాయులు సలోమీ,మల్లికా బాయి, శంకర్,గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి.......

**- ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు ......**



**చాగలమర్రి , జులై 06( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సహకారంతో చాగలమర్రి గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు అన్సర్‌భాష,కొలిమి హుసేన్ వల్లి,మౌళాలిలు తెలిపారు. సోమవారం గుంత పాలెం వీధిలో సుమారు రూ. 7 లక్షలతో సిమెంట్ రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సిబ్బందికి సూచించారు. హచ్ టవర్ వద్ద రూ 4 లక్షలతో,అలాగే భూమా నగర్‌లో మరో 19లక్షల ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్లు,డ్రైనేజీ పనులు త్వరలో చేబడతామన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాధురి,టిడిపి నాయకులు జెట్టి నాగరాజు,రాజేంద్ర, హుసేన్‌పీర్, అస్రప్,గఫార్,నాగూరు,పెద్దమహమ్మద్,భీముడు మదార్‌వలి, మాబులాల్, మహమ్మద్ గౌస్, షపి,కాంట్రాక్టర్ నజీర్,తదితరులు పాల్గొన్నారు.

## జంతు ప్రేమ జాగ్రత్త సుమా......

**పెంపుడు కుక్కకు టీకా వేయిస్తున్న యజమాని......**



**చాగలమర్రి , జులై 06( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** మూగ జీవాల ప్రేమికులు పెంపుడు జంతువులతో జాగ్రత్తగా ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వరప్రసాద్ సూచించారు. చాగలమర్రి పట్టణంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో సోమవారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు రేబీస్ టీకాలు వేసారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మనుషుల నుంచి జంతువులకు, జంతువుల నుంచి మనుషులకు బ్యాక్టీరియా లేదా పరాన్నజీవుల ద్వారా వివిధ వ్యాధులు వ్యాప్తి చెందడాన్ని జునోసిస్ అంటారన్నారు.చాలా మందికి పెంపుడు జంతువులంటే ప్రాణం. వాటిని కన్నపిల్లలతో సమానంగా కంటికి రెప్పలా చూసుకుంటారని అవి కూడా అంతకు మించిన ప్రేమను పంచుతాయన్నారు. అయితే జంతువులు, పక్షుల పెంపకంలో కొన్ని జాగ్రత్తలు అవసరమన్నారు. పెంపుడు జంతువులు,పక్షుల నుంచి కొన్ని వ్యాధులు సంక్రమిస్తుండటమే ఇందుకు కారణమన్నారు. ప్రాణాంతక వ్యాధులు ఎక్కువగా జంతువులు, పక్షుల నుంచి వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో వీటిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాలలో విద్యారులకు జునోసిస్ దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివలక్ష్మి,పశువైద్య సిబ్బంది బాష,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ సేవలకు ఇక బ్రేక్...ఉద్దేశపూర్వకంగానే అడ్డుకున్న టీడీపీ నేతలు..మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి

**నంద్యాల:జులై =6 ప్రజాజ్యోతి** నంద్యాల ప్రజల గుండెల్లో మరో సేవా సంస్థ మూతపడింది..! రాజకీయ కక్షసాధింపుల మధ్య.. ఒక అద్భుతమైన ప్రజా సేవకు బ్రేక్ పడింది..! దాదాపు 28 ఏళ్లుగా నంద్యాల ప్రజలకు సేవలందిస్తూ.. అండగా నిలిచిన శిల్పా సేవాసమితి ఆశయాల పై.. అధికార పక్షం రాజకీయాల ముళ్ళకంచె వేసింది..! నంద్యాల నడిబొడ్డున పేద, మధ్యతరగతి వర్గాలకు నమ్మకమైన ఆదర్శంగా నిలిచిన “శిల్పా సహకార్ సూపర్ మార్కెట్” ఇకపై కనిపించదు.. సేవలందించదు..! పంతాలు.. పట్టింపులు.. రాజకీయ కక్షల మధ్య ఈ సూపర్ మార్కెట్‌ను బలవంతంగా మూసివేయించారంటూ.. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాల ప్రజలకు సేవ చేయలేకపోతున్నామంటూ మీడియా సాక్షిగా క్షమాపణలు కోరారు..!“28 సంవత్సరాలుగా మా నాన్నగారు శిల్పా మోహన్ రెడ్డి గారు నంద్యాల ప్రజల కోసం ఈ సేవా సమితిని నడిపారు. 23 ఏళ్లుగా పాడుబడిపోయిన మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్‌ను మా సొంత ఖర్చులతో రిపేర్ చేసి.. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఒక సహకార సూపర్ మార్కెట్‌ను ఏర్పాటు చేశాం. 2009 నుంచి ఏ రోజూ, ఏ ప్రభుత్వం కూడా దీనిపై కక్ష సాధింపులు చేయలేదు. కానీ ఈరోజు.. కేవలం మాపై ఉన్న రాజకీయ కక్షతోనే ఉద్దేశపూర్వకంగా ఖాళీ చేయించారు. నంద్యాల ప్రజలారా.. మమ్మల్ని క్షమించండి.. మీకు ఇకపై మేము ఈ సేవలు అందించలేకపోతున్నాం..”



రాజకీయ కక్షలు నాయకుల మధ్య ఉండాలి.. కానీ పేదల పొట్ట కొట్టేలా మారకూడదు. శిల్పా సహకార్ సూపర్ మార్కెట్ మూతపడటంతో.. కేవలం ఒక బోర్డు మాత్రమే పడిపోలేదు.. అక్కడ నమ్ముకుని బతుకుతున్న 45 మంది పేద మహిళల ఉపాధి రోడ్డున పడింది..! ఆ కుటుంబాల దీనస్థితికి ఎవరు సమాధానం చెప్తారు? ఇదేనా మీ అభివృద్ధి? గతంలో డాక్టర్ వైఎస్సార్ కళ్యాణమండపం ద్వారా పేదలు కేవలం 5 వేల నుండి 9 వేలకే పెళ్లిళ్లు చేసుకునేవారు. కానీ దాన్ని చేజిక్కించుకుని, ఈరోజు ఆ ఫీజును అక్షరాలా లక్షన్నరకు పెంచేసి పేదల రక్తాన్ని పిండుతున్నారు..! చేతనైతే సేవ చేయండి.. అంతేకాని.. సేవ చేసేవాళ్లకు డ్డుపడకండని శిల్పా రవి రెడ్డి మండిపడ్డారు.ఐపీఎల్ వేలాన్ని తలపించేలా.. కేవలం శిల్పా సేవాసమితిని దెబ్బతీయడమే లక్ష్యంగా ఈ వేలం పాటలు సాగాయని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన మార్కెట్ యార్డ్ స్థలాన్ని.. ఎకరాకు కేవలం వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్ల లీజుకు ఇవ్వడం వెనుక ఉన్న మతలబు ఏంటి? వక్ఫ్ భూములను ముస్లింల సంక్షేమానికి వాడకుండా.. ఎస్పీ కార్యాలయానికి ఇవ్వడం ఎంతవరకు సబబు? మీకు అంతగా కావాలంటే.. మీ పార్టీ కార్యాలయం కోసం చూసుకున్న నూనెపల్లె మార్కెట్ యార్డ్ స్థలాన్ని ఎస్పీ ఆఫీస్‌కు ఇవ్వొచ్చు కదా అని శిల్పా రవి రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు. రాజకీయాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ ప్రజలకు జరిగే సేవ శాశ్వతంగా ఉండిపోతుంది. ఒక మంచి వ్యవస్థను కూల్చేసి సాధించే రాజకీయం ఎవరికి లాభం? 45 మంది మహిళల కన్నీళ్లు.. వేలాది మంది నంద్యాల ప్రజల ఆవేదన.. ఎటు దారితీస్తుంది? నంద్యాల ప్రజల గుండెల్లో రేగిన ఈ మంటకు.. అధికార పక్షం సమాధానం చెప్తుందా? “సేవను ఆపడం రాజకీయం అనిపించుకోదు.. కక్షసాధింపు మాత్రమే అవుతుందన్నారు!”

## గిరిజన బాలికల పాఠశాల ఆవరణలో అకస్మాత్తుగా కూలిన విద్యుత్ స్తంభం. ప్రహరి గోడ

**బాలికలకు తప్పిన పెను ప్రమాదం.**

**అనంతగిరి మండలం. జులై 6. ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** అల్లూరి సీతారామరాజు జిల్లా. అనంతగిరి మండలం అనంతగిరి మండల కేంద్రంలో గలగిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల 1. లో సోమవారం నాడు పెనుప్రమాదం తప్పింది. బాలికల పాఠశాల ఆవరణ లోపల ఉన్న విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా విరిగిపడడమే కాకుండా పాఠశాలకు ఎదురుగా ఉన్న ప్రహరీ గోడ కూలింది తరగతులు జరుగుతున్న సమయం కాబట్టి విద్యార్థినులుఏ ఒక్కరు బయట లేరు. కానీ విద్యుత్ స్తంభం కింద విద్యార్థిని తల్లిదండ్రులు పిల్లలను చూడడానికి వచ్చి నిలబడి ఉండి విశ్రాంతి కోసం పక్కనున్న భవనం కు వెళ్లారు వెళ్లిన మరుక్షణం విద్యుత్ స్తంభం ఒక్కసారిగా విరిగిపడింది. ఆ సమయంలో ఎవరు లేకపోవడం వల్ల పెను ప్రమాదం తప్పింది. అదే ఆదివారం రోజు ఇలా జరిగి ఉంటే ప్రాణం నష్టం జరిగి ఉండేది ఎందుకంటే ఆదివారం రోజు గనుక పిల్లలందరూ పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ ఉంటారు. ప్రహరి గోడ విషయానికొస్తే నాణ్యతతో కూడిన నిర్మాణం జరగలేదు ఇటువంటి నిర్మాణాలు ఇంజనీరింగ్ అధికారులు జరిపి గిరిజన విద్యార్థినుల ప్రాణాలతో చెలగాట మాడుతున్నట్టు తెలుస్తుందని విద్యార్థిని తల్లిదండ్రులు మండిపడ్డారు



అదేవిధంగా పాఠశాల లోపల విద్యుత్ స్తంభం ఎందుకు వేశారు వందలాది మంది విద్యార్థులు ఉన్నచోట ఇటువంటి ప్రమాదకరమైన స్తంభాలు వేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని విద్యార్థినుల ప్రాణాలు కాపాడాలని పలువు కోరుతున్నారు . విద్యుత్ స్తంభం విరిగి పడి.ప్రహరీ గోడ కూలి విద్యార్థినుల తల్లిదండ్రులు లబోదిగిపోమంటుంటే పాఠశాల ఉపాధ్యాయులకు చీమ కుట్టినట్లు లేదు కనీస మానవత్వం లేకుండా ఉన్నతీరు ఉపాధ్యాయుల ప్రవర్తనలో విలేకరులు కనబడింది.

## నేడు మండల సర్వ సభ్య సమావేశం



**హొళగుంద, జులై 6, ప్రజా జ్యోతి న్యూస్:-** స్థానిక ఎంపీడీ ఓ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ ఉమర్ తెలిపారు. మండల ఎంపీపీ తంబాకు నూర్జహన్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు అజెండాలో చూపిన అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే అందజేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు,ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు మండల సర్వ సభ్య సమా వేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

## కురుకుందలో ఘనంగా జలధార జల హారతి’

**రూ.60 లక్షలతో మోడల్ ట్యాంక్‌గా మాచ వీరప్ప చెరువు**

**ఆత్మకూరు:జూలై=6 ప్రజాజ్యోతి ఆత్మకూరు:** శ్రీశైలం నియోజక వర్గ పరిధిలోని జల వనరుల రూపురేఖలను మార్చేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘జలధార జల హారతి’ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కురుకుంద గ్రామంలో శనివారం సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలోని చారిత్రాత్మక మాచ వీరప్ప చెరువును రూ.60 లక్షల భారీ వ్యయంతో ఒక మోడల్ ట్యాంక్ గా అభివృద్ధి చేసే పనులకు శ్రీశైలం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

**శాస్త్రోక్తంగా భూమిపూజ.. స్వయంగా ప్రొక్లయిన్ నడిపిన ఎమ్మెల్యేలి**

గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గారు చెరువు కట్టపై శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. అనంతరం ఆయన స్వయంగా ప్రొక్లయిన్ (జెసిబి) వాహనాన్ని నడిపి, మట్టిని తవ్వి అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా రంగంలోకి దిగి యంత్రాన్ని నడపడం అక్కడికి చేరిన గ్రామస్తులను, కార్యకర్తలను ఎంతగానో ఆకట్టుకుంది.

**మోడల్ ట్యాంక్‌గా రూపాంతరం.**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రూ.60 లక్షల వ్యయంతో మాచ వీరప్ప చెరువును కేవలం నీటి వనరుగానే కాకుండా, గ్రామానికి ఒక అందమైన ఆకర్షణగా, మోడల్ ట్యాంక్‌గా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు విస్తృతంగా పూడికతీత పనులు చేపడతానన్నారు. రాబోయే వర్షాకాలానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చెరువు కట్టలను బలోపేతం చేసి, పటిష్టమైన పిచ్చింగ్ పనులు నిర్వహిస్తామన్నారు. రైతాంగానికి సాగునీరు,






గ్రామస్తులకు తాగునీటి ఎద్దడి లేకుండా చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. ‘జలధార జల హారతి’ ద్వారా నియోజకవర్గంలోని అన్ని జల వనరులను పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

**గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు**

దశాబ్దాలుగా సరైన ఆధరణ లేక పూడికకు గురైన మాచ వీరప్ప చెరువుకు రూ.60 లక్షలు కేటాయించి, మోడల్ ట్యాంక్‌గా మార్చేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి గారికి కురుకుంద గ్రామస్తులు, రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్డీయే కూటమి నాయకులు రైతులు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## చింతూరు డివిజన్‌లో 108 అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రకటన




**చింతూరు జులై 6 ప్రజాజ్యోతి** చింతూరు ఐటీడీఏ పిఓ ఆదేశాల మేరకు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్, చింతూరు డివిజన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారు. చింతూరు డివిజన్ పరిధిలో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు 2 పోస్టులు మినీ అంగన్వాడీ వర్కర్లు 2 పోస్టులు అంగన్వాడీ హెల్పర్లు 104 పోస్టులు మొత్తం ఖాళీలు : 108 పోస్టులు ఉన్నాయని అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు నోటిఫికేషన్ లో పేర్కొన్న విద్యార్హతలు, వయోపరిమితి, స్థానికత, అవసరమైన ధ్రువపత్రాలు, ఎంపిక విధానం, దరఖాస్తు గడువును జాగ్రత్తగా పరిశీలించి నిర్ణీత గడువులోపు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాల యాలు, సీడీపీఓ కార్యాలయాలు, సంబంధి త అంగన్వాడీ కేంద్రాల నోటీస్ బోర్డులలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## చింతలచెరువు గ్రామంలో వైభవంగా గంగమ్మ తల్లి జయంతి వేడుకలు....

**చాగలమర్రి , జులై 06( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతల చెరువు గ్రామంలో ఆదివారం , సోమవారం గంగమ్మ తల్లి జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సోమవారం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# కడప ఉక్కు పరిశ్రమతో రాయలసీమ ప్రజల కల నిజం కాబోతోంది:ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వర రెడ్డి



**ఎమ్మిగనూరు జులై 06(ప్రజా జ్యోతి ):**స్థానిక పట్టణ లో ముందుగా, దళితుల ఆశాజ్యోతి, స్వాతంత్ర్య సమర యోధుడు, భారత మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 40 వ వర్ధంతిని నివాళులు అర్పించారు. అనంతరం రాయలసీమ అభివృద్ధికి మైలురాయిగా నిలిచే కడప జిల్లా జమ్మలమడుగు ఉక్కు పరిశ్రమ నిర్మాణ పనులను గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు జేఎస్‌డబ్ల్యూ సంస్థతో కలిసి పునఃప్రారంభించడం హర్షణీయమని ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి మూడు సార్లు శంకుస్థాపనలు చేసినప్పటికీ, పరిశ్రమ నిర్మాణంలో అంగుళం కూడా పురోగతి సాధించలేదని విమర్శించారు. కడప ఉక్కు పేరుతో ప్రజలను మభ్యపెట్టి, వైఎస్ కుటుంబం రాజకీయ లబ్ధి పొందేందుకు మాత్రమే ప్రయత్నించిందని ఆరోపించారు.అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన కల్పిస్తోందని తెలిపారు. మైలవరం డ్యాం నుంచి 2 టీఎంసీల నీటి కేటాయింపు, రూ.40 కోట్లతో నాలుగు లైన్ల యాక్సెస్ రోడ్డు నిర్మాణం, ముద్దనూరు నుంచి రైల్వే లైన్ అనుసంధానం, 268 మెగావాట్ల సబ్‌స్టేషన్ ఏర్పాటు, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.25 కోట్ల కేటాయింపు వంటి చర్యలు చేపట్టినట్లు వివరించారు.స్టీల్ ప్లాంట్ కోసం 1,100 ఎకరాలు, టౌన్‌షిప్ కోసం 200 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. అదేవిధంగా, పర్యావరణహిత 'గ్రీన్ స్టీల్' ఉత్పత్తి లక్ష్యంగా కోసం మరో 2,000 ఎకరాలను కేటాయించడం జరిగిందన్నారు.సుమారు రూ.16,350 కోట్ల పెట్టుబడులతో రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ప్రాజెక్టును 2028 నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా రాయలసీమలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపు రావడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే వైసీపీ క్రెడిట్ చోరీ, రాజధాని మావిగన్, ఇతర అంశాలపై జగన్మోహన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ఎమ్మెల్యే బీవీ తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కర్ణి కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, కేడీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వర్ రావు, ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సభ్యులు పోతురాజు రవికుమార్, ఏఎంసీ చైర్మన్, మండల పట్టణ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, స్థానిక నాయకులు, మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో ప్రజల నుండి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి



**ఎమ్మిగనూరు జూలై 6(ప్రజా జ్యోతి ):** స్థానిక పట్టణంలోని ఆర్ బి అతిథి గృహంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి పాల్గొని ప్రజల నుండి నేరుగా అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ వ్యక్తిగత, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా భూ సంబంధిత సమస్యలు, కొత్త పింఛన్ల దరఖాస్తులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలు, వీధి కుక్కల బెడదతో పాటు ఇతర ప్రజా సమస్యలపై పెద్ద సంఖ్యలో వినతులు అందాయి. ప్రతి అర్జీని ఎమ్మెల్యే శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని, ప్రతి అర్జీపై వేగంగా స్పందించి నిర్దిష్ట గడువులోగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన కూటమి పార్టీ నాయకులు నందవరం మండల అధ్యక్షులు కాశీం వలి, పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## గురు నవోదయ కోచింగ్ యాజమాన్యం పై కేసు నమోదు చేయాలి...

**ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థికి న్యాయం చేయాలి- విద్యార్థి సంఘాలు ధర్నా.....**



**ఎమ్మిగనూరు జులై 06 (ప్రజాజ్యోతి ):**పట్టణంలో గురు నవోదయ కోచింగ్ సెంటర్లో ఆత్మహుతి కారకులైన యాజమాన్యంపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని పి.డి.ఎస్. యు జిల్లా కార్యదర్శి బి మహేంద్ర బాబు, ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు గఫూర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పట్టణంలో సోమప్ప సర్కిల్ నందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కోచింగ్ సెంటర్ లో విద్యార్థులకు సరిపడ వసతులు కల్పించకుండా విద్యా ర్థులను ఖైదీల బంధిస్తూ సబ్ జైల్ ఏర్పాటు చేయడంతో మానసిక ఒత్తిడి గురై కోచింగ్ సెంటర్లో విద్యార్థులకు ఎలాంటి ఆటవిడుపు లేకుండా ఉదయం 6 గంటల నుండి రాత్రి 8:30 దాకా చదువు పేరుతో విద్యార్థులను మానసికంగా ఇబ్బందులు గురిచేసే పరిస్థితి ఉంది ఇలాంటి పరిస్థితులలో విద్యార్థులు మనోవేదన గురై కోచింగ్ సెంటర్ యాజమాన్యం వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య యత్నానికి పాల్పడే పరిస్థితి ఉందన్నారు. అదేవిధంగా పట్టణంలో ఉన్న కోచింగ్ సెంటర్లకు ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తూ నవోదయ కోచింగ్ పేరుతో లక్షల రూపాయలు దండుకునే పరిస్థితి కనబడుతుంది కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలని అనేక సందర్భాల్లో విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. అలాగే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నితీష్ అనే విద్యార్థికి నష్ట పరిహారం చెల్లించాలి అదేవిధంగా యాజమాన్యంపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని వారు అన్నారు. అదేవిధంగా పట్టణంలో అనేక కోచింగ్ సెంటర్లు నవోదయ పేరుతో లక్షల రూపాయలు దోచుకునే పరిస్థితి కనబడుతోంది విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించకుండా వారి ఆర్భాటలతోనే విద్యార్థులను నాలుగు గోడల మధ్య మానసికంగా వేధించే పరిస్థితి ఉంది కాబట్టి తక్షణమే ఇలాంటి కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్,పి.డి.ఎస్.యు నాయకులు మునిస్వామి ప్రతాప్,రాజు,సలాం భాష, వీరేష్, నజీర్,సురేష్,రవి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సహకార సంఘాల వారోత్సవాలు డాక్టర్ కే రాఘవేంద్ర చౌదరి

**రైతులకు సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి**



**ఎమ్మిగనూరు జులై 06(ప్రజా జ్యోతి ):** మండల పరిధిలోని హెచ్ కైరవాడి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సోమవారం సహకార సంఘాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సహకార వ్యవస్థ ఏర్పడి 5 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ బి. తిమ్మ రెడ్డి సహకార జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం భూసార, నీటి పరీక్షల నిపుణులు డా.రాఘవేంద్ర చౌదరి రైతులకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, ఎరువులు, పురుగుమందులను శాస్త్రీయంగా వినియోగించే విధానం, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పంటల సాగు విధానాలను వివరించారు.అనంతరం చైర్మన్ బి. తిమ్మారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బి వి జయనాగేశ్వరరెడ్డి సహకారంతో రైతులు సహకార సంఘాల ద్వారా అందుతున్న రుణాలు, ఎరువులు, విత్తనాలు తదితర సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. సహకార సంఘాలు రైతుల అభ్యున్నతికి కీల కంగా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఆనందు, వెంకట్రాముడు సీఈఓ ప్రకాష్‌రెడ్డి, సిబ్బంది రైతులు, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యారంగానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- విద్యార్థుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వర రావు
- విద్యార్థులకు నాణ్యమైన అందించే దిశగా కూటమి చర్యలు
- నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించేలా కృషి
- రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరుబోతు రమణారావు





**విజయవాడ , ప్రజాజ్యోతి న్యూస్:** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 57 వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరీ పేటలో ఉన్న కేర్ అండ్ షేర్ పాఠశాల లో స్థానిక ఎమ్మెల్యే , రాష్ట్ర ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు గ్లాసులు ప్లేట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోస్ట్ మాస్టర్ రామచంద్రయ్య సహకారం అందించగా ఎమ్మెల్యే బోండా ఉమా తో కలిసి రాష్ట్ర నాగవంశ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మెన్ ఎరుబోతు రమణారావు పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోండా ఉమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రతీ ఒక్క విద్యార్థి ప్రభుత్వం అందించే నాణ్యమైన విద్యకు దూరం కాకూడదని వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతూ విద్యారంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఎరుబోతు రమణారావు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. చిన్నారులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యారంగం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందన్నారు. సమాజంలో దాతలు కూడా విద్యారంగం అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయమని ,ప్రభుత్వం ప్రజల భాగస్వామ్యంతో విద్యారంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కబీర్ ఎరుబోతు కనకారావు తిరుపతి అప్పలనాయుడు మచ్చా ఇమాన్యుయల్ పాఠశాల సిబ్బంది కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కంబదూరులో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహణ



**కంబదూరు జులై 6:(ప్రజా జ్యోతి) న్యూస్** కంబదూరు మండల కేంద్రంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని దండ వెంకటేశులు, ఆవుల తిప్పేస్వామి, ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు రఫీ, యంగ్ ఇండియా భాషా, అమలి విజి, డీలర్ రవి, డీలర్ మలీ,తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు.

## జీవో 396 ను తక్షణమే రద్దు చేయాలి

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్ డౌన్ కార్యక్రమం
- జిల్లా రైటర్ల సంఘం అధ్యక్షులు పైడి రామ్ ప్రసాద్





**పొందూరు ప్రజాజ్యోతి న్యూస్** :రిజిస్టేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసే జీవో 396 ను తక్షణమే రద్దు చేయాలని శ్రీకాకుళం జిల్లా రైటర్ల సంఘం అధ్యక్షులు పైడి రామ్ ప్రసాద్ ఉపాధ్యక్షులు బలివాడ సత్యన్నారాయణ డిమాండ్ చేశారు. పొందూరు మండల కేంద్రంలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాల యం వద్ద సోమవారం నాడు పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాటా ్లడుతూ రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రవేటీకరణ చేయవద్దని ప్రవేటీకరణ చేయడం వల్ల పారదర్శకత దెబ్బతింటుందన్నారు.దస్తావేజు లేఖర్ల లైసెన్సు పునరుద్ధరించి ,ప్రభుత్వం లేఖర్ల జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ రవి శంకర్ సాహు కు తమ సమస్యల పట్ల వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొందూరు మండల రైటర్లు పాల్గొన్నారు.

## పెనుగాలులతో విరిగిపడ్డ ధ్వజస్తంభం........



**చాగలమర్రి , జులై 06( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** ఆదివారం మండలకేంద్రంలో వీచిన పెనుగాలులకు పాతబస్టాండు సమీపంలోని చెన్నకేశవ ఆలయంలో ధ్వజస్తంభం విరిగి పడింది. ఆ సమయంలో భక్తులు లేక పోవడంతో ఘోర పెను ప్రమాదం తప్పింది. ఎన్నో ఏళ్ల నుంచి చెక్కు చెదరకుండా ఉన్న ధ్వజస్తంభం పెను గాలుల వల్ల విరిగి పడటంతో భక్తులు, కమిటీ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి , కమిటీ సభ్యులు ధ్వజస్తంభం పరిశీలించి పునరుద్ధరణ చర్యలు తీసుకుంటామని అన్నారు.

## చాగలమర్రి మండలంలో చెక్క భజన కార్యక్రమంలో పాల్గొన్న నంది అవార్డ్ గ్రహీత డ్యాన్సర్ సమీరా......



**చాగలమర్రి , జులై 06( ప్రజాజ్యోతి న్యూస్ ) ;** నంద్యాల జిల్లా చాగలమర్రి మండలం చింతలచెరువు గ్రామంలో గంగమ్మ తల్లి పుట్టినరోజు సందర్భంగా రెండు రోజులు కార్యక్రమాలు అత్యంత అద్భుతంగా నిర్వహించారు.ఆదివారం నిర్వహించిన చాగలమర్రి సత్యమ్మ తల్లి భజన బృందం మాస్టర్ మోహన్ ఆధ్వర్యములో చెక్కభజన కార్యక్రమంలో భాగంగా పాలగిరి రమేష్ రెడ్డితో సహా పలువురి పిలుపు మేరకు విచ్చేసిన నంది అవార్డ్ గ్రహీత డ్యాన్సర్ సమీరా తనదైన శైలిలో నృత్యప్రదర్శన చేసి అందరినీ అలరించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజ అనంతరం అల్పాహారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు , గ్రామ ప్రజలు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# పశు వైద్యశాలలో జోనోసిస్ డే కార్యక్రమం





**- ఉచితంగా యాంటీ రేబిస్ వాక్సిన్ కార్యక్రమం**

**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :** యాంటీ రేబిస్ వ్యాక్సిన్ కనిపెట్టిన అస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ జన్మదినం సందర్భంగా పొందూరు మండల కేంద్రంలో స్థానిక పశు వైద్యశాలలో జోనోసిస్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్య శాఖ ఏ .డి డాక్టర్ జి రఘునాథ్ అన్ని పెంపుడు కుక్కలు సుమారు 70 డోసులు వరకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల యాజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు. రేబిస్ వంటి ప్రాణాంతకర వ్యాధిని నివారించడంలో టీకాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ , పెనుబర్తి వెటర్నరీ ఆసుపత్రి డాక్టర్ బి హేమంత్ , పశు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆమదాలవలస వైసీపీ కార్యాలయంలో కీలక సమావేశం.. సోషల్ మీడియా విభాగానికి చింతాడ రవికుమార్ దిశా నిర్దేశం



**ఆమదాలవలస:::** ప్రజాజ్యోతి పార్టీ సిద్ధాంతాలను, ప్రజా కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) ఇంచార్జ్ చింతాడ రవికుమార్ పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం పట్నంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో సోషల్ మీడియా విభాగం నాయకులు, కార్యవర్గ సభ్యులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంలో సోషల్ మీడియా విభాగం కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యకర్తలు, నాయకులు అందరూ సమన్వయంతో పనిచేస్తూ పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. రాబోయే రోజుల్లో సోషల్ మీడియా వేదికగా పార్టీ వాయిస్‌ను బలంగా వినిపించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వైసీపీ సోషల్ మీడియా విభాగానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**8లోపు డీఈవో కార్యాలయానికి సమర్పించాలి**

**నంద్యాల, జూలై 6,(ఆంధ్రపత్రిక)** 2026--27 విద్యా సంవత్సరానికి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ పోస్టు నియామకానికి సంబంధించి పాఠశాల విద్య డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్, అమరావతి సవరించిన మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ పోస్టు భర్తీని పూర్తిగా మెరిట్ ఆధారంగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తు ఫారాలు ఉప విద్యాశాఖ అధికారి , మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. నంద్యాల జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులైన ఎస్.ఏ. (పీడీ), పీ.ఈ.టీ.లు తమ దరఖాస్తులను సంబంధిత ప్రధానోపాధ్యాయులచే ధ్రువీకరించుకుని ఈ నెల 8వ తేదీలోపు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం, నంద్యాలలో సమర్పించాలని సూచించారు. గడువు దాటిన తర్వాత అందిన దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని అధికారులు స్పష్టం చేశారు.

# తాడేపల్లిలో బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ముదునూరి

**--ఘన నివాళులు అర్పించిన రాష్ట్ర వైసీపీ నాయకులు**



**కాకినాడ జిల్లా జూలై 06(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన బాబు జగ్జీవన్ రామ్ 40వ వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య నాయకులతో కలిసి ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు,నరసాపురం పార్లమెంటు పరిశీలకులు,ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణం రాజు పాల్గొన్నారు.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు బాబు జగ్జీవన్ రామ్ సేవలను స్మరించుకుంటూ ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ముఖ్య నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు

# ఈదురుగాలికి నేలకొరిగిన విద్యుత్ స్తంభం

**ఇబ్బందుల్లో ప్రజలు**



**పోరుమామిళ్ల జూలై 6(ప్రజా జ్యోతి ప్రతినిధి)** కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలో దమ్మనపల్లి పంచాయతీ కటికింద పల్లె హరిజనవాడలో ఈదురుగాలికి విద్యుత్ స్తంభం నేలకొరిగిన ఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనతో కాలనీ లోని ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించవలసిందిగా వారు కోరారు. కాలనీలోని ప్రజలు అధికారులకు ఎంత విన్నవించుకున్నానో పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆర్ పి ఐ (ఎ)పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి గా రంగయ్య

**సమతా సైనిక్ దళ్ నుండి పార్టీ కార్యవర్గం లో గుర్తింపుతో బాధ్యత పెరిగింది -రంగయ్య**



**కర్ణాటక జులై (ప్రజా జ్యోతి ):** బెంగుళూరు లో జరిగిన ఆర్ పి ఐ పార్టీ ముఖ్య నేతల సమావేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ బలోపేతానికి పలు కీలక అంశాలపై సుధీర్ఘ చర్చల అనంతరం ముఖ్య నాయకులు ఇండియా సౌత్ జనరల్ సెక్రటరీ అజయ్ ప్రసన్న గారి అభ్యర్థన మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రంగయ్యకు ఆర్ పి ఐ(ఏ )లో కీలక బాధ్యతలు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అత్వాలే) ఆర్ పి ఐ(ఏ) జాతీయ అధ్యక్షులు, కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అత్వాలే గారి ఆదేశాల మేరకు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి గారి ద్వారా శ్రీ చలువది రంగయ్య గారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినట్లు అధికారికంగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి జాతీయ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత బి. ఆర్ . అంబేద్కర్ ఆశయాల సాధన, సామాజిక న్యాయం, సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే, పార్టీ జాతీయ నాయకత్వం సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ, ప్రజల మధ్య పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. ఈ నియామకంతో రాష్ట్రంలో ఆర్ పి ఐ(ఏ) మరింత బలోపేతం అవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. రాయలసీమ ఉపాధ్యక్షులుగా కనకవీడు పరమేష్,కర్నూలు జిల్లా అధ్యక్షులు గా కడివేళ్ల రాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి గా దొమ్మలదిన్నె లక్ష్మన్న డివిజన్ ఉపాధ్యక్షులు గా గోవిందు కి నియామక పత్రాలును వెంకటస్వామి గారు అందించారు. నాయకులకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుంది అని భరోసా కల్పించారు. త్వరలో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నూతన కమిటీ లు వేస్తాం అని ప్రతీ నియోజకవర్గం లో నీలి జెండా రేపరేపలాడుతుంది అని ఆశభావం రంగయ్య గారు వ్యక్తం చేశారు. ఆర్ పి ఐ(ఏ) ప్రస్తుతం నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్ డి ఏ) కూటమిలో భాగస్వామ్య పార్టీగా కొనసాగుతోందని రాబోయే ఎన్నికలలో కూటమి లో భాగంగా ఆర్ పి ఐ(ఏ )పార్టీ కూడా ఎన్నికల రేస్ లో అభ్యర్థులను నిలబెడతాం అని రంగయ్య గారు తెలిపారు.

# ఆలయ ధర్మకర్త కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా



**కాకినాడ జిల్లా జూలై 06(ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ప్రత్తిపాడు నియోజకవర్గం స్థానిక ప్రత్తిపాడు గ్రామానికి చెందిన. అంబేద్కర్ జంక్షన్ లో వెలిసిన దుర్గ అమ్మవారి ఆలయ ధర్మకర్త దాసరి సత్తిబాబు ఇటీవల కాలంలో స్వర్గస్తులయ్యారు. ప్రత్తిపాడులోని వారి ఇంటివద్ద సోమవారం శాసన సభ్యురాలు సత్య ప్రభ రాజా సత్తిబాబు కుటుంబ సభ్యులను కలిసి, పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి సంతాపం తెలియజేస్తూ కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అంతే కాకుండా ఆర్థిక పరిస్థితి అడిగి తెలుసుకుని వారికి నేనున్నానంటూ ధైర్యం చెప్పి కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వేశ్వరరావు ,యర్రాబత్తుల గోవింద నాయుడు ,జనసైనికులు గోపిశెట్టి శ్రీను ఎక్స్ ఎంపీటీసీ శెట్టి బత్తుల వీరబాబు.మాజీ సర్పంచ్మార సత్యనారాయణ ప్రసాద్. వెలుగుల నాని, పోలిశెట్టి శ్రీను, మరి కోటమ్మ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని సత్యనారాయణ కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

# ఎరువుల కొరత లేదు: ఏడిఏ మురళీకృష్ణ

**ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు**

**రైతులకు ఆందోళన అవసరం లేదు**

**పండిత విల్లూరులో ఎరువుల దుకాణాలు తనిఖీలు**

**యూరియా, డి ఎ పి, కాంప్లెక్స్ ఎరువులు, పొటాషియం, ఫాస్పేట్ అవసరాన్ని తగినట్లు ఎరువులు**



**పోడూరు, (ప్రజాజ్యోతి), - జులై -06 :** సార్వా వరి సాగు విస్తీర్ణతకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎరువుల కొరతకు రైతులు ఆందోళన చందనవసరం లేదని వ్యవసాయ శాఖ పాలకొల్లు ఏడిఏ పి.మురళీకృష్ణ తెలిపారు. పోడూరు మండలం పండితవిల్లూరులోని సొసైటీ, స్థానిక ఎరువుల దుకాణాలను ఏడిఏ పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి (ఏవో) ఎం.విశ్వాసరావు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ ఎరువుల విక్రయాలు ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారానే విక్రయాలు నిర్వహించాలని సూచించారు. తనిఖీ చేసిన దుకాణాలలో యాప్ ద్వారానే ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయని గుర్తించామన్నారు. ఎరువుల కొరత లేదని రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి రైతు సాగు చేసిన విస్తీర్ణంకు సిఫార్సు చేసిన మోతాదు మేరకు యూరియా, డిఏపి ,ఎరువులు అందిస్తాము అని తెలియచేశారు. మండలంలో ప్రస్తుతం యూరియా 294 మెట్రిక్ టన్నులు, డి ఏ పి -51 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు -468 మెట్రిక్ టన్నులు, పొటాష్ -73 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్-35 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈఓ చిరంజీవి, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అవినీతిపై మౌనం ఎందుకు



**హైదరాబాద్ :** జనసంఘ్ స్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలను హైదరాబాద్ లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో పాటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్. రావు తదితర నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. దేశ సమైక్యత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు మరువలేనివని ఈ సందర్భంగా నేతలు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలు ఆడుతున్నాయని మండిపడ్డారు. జాతీయ డ్యాం భద్రతా సంస్థ హెచ్చరించినా మరమ్మతులు చేపట్టకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే.. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి ఆ అవినీతిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారని నిలదీశారు. మరోవైపు హైడ్రా కూల్చివేతల తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. హైడ్రా కేవలం పేదల ఇళ్లను టార్గెట్ చేస్తోందని... ఎంఐఎం నేతలకు చెందిన ఫాతిమా విద్యాసంస్థల అక్రమ కట్టడాలపై కోర్టులు తప్పుబట్టినా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్-ఎంఐఎం దోస్తీ వల్లే ఈ పక్షపాతమని... హైడ్రా అందరికీ ఒకే చట్టాన్ని వర్తింపజేయాలని, లేనిపక్షంలో విపక్షాల అక్రమాలపై రాష్ట్రవ్యాప్త పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

# ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి

**తహసీల్దార్ సునీత**



**దువ్వూరు,జులై 06 ( ప్రజా జ్యోతి )** దువ్వూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ సునీత ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను అధికారులు అత్యంత ప్రాధాన్యతతో, బాధ్యతాయుతంగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో అమర్నాథ్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎఈ శివ కుమార్,మండల సర్వేయర్ మదన్ మోహన్ రెడ్డి,ఎపిఓ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

# దండంగి అటవీ ప్రాంతంలో కలప మాఫియా

**భారీగా అక్రమ వెదురు నరికివేత..**

**బీట్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు..**

**ఉన్నతాధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు..**

**జిల్లా కలెక్టర్ వెదురు ను పెంచాలని అవగాహన కార్యక్రమాలు చేస్తున్నా రెచ్చిపోతున్న కలప మాఫియా...**

**స్మగ్లర్లకు సహకరిస్తున్న అటవీ శాఖ అధికారులు..**



**దేవీపట్నం జులై 6(ప్రజా జ్యోతి ):**పోలవరం జిల్లా దేవీపట్నం మండలం దండంగి నార్త్ జోన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భారీ ఎత్తున అక్రమంగా వెదురు నరికివేత జరుగుతున్నట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అటవీ సంపదను రక్షించాల్సిన ప్రాంతంలోనే వెదురును విచ్చలవిడిగా నరికి తరలిస్తున్నారని,దీనివల్ల అడవి విస్తీర్ణం దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం,కొంతకాలంగా ఉదయం వేళల్లో వెదురు నరికివేత కొనసాగుతున్నప్పటికీ రాత్రి సమయంలో అక్రమ రవాణా కొనసాగుతుంది. సంబంధిత అటవీశాఖ సిబ్బంది సమర్థవంతంగా అడ్డుకోలేకపోతున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమంగా నరికిన వెదురును ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అడవుల్లో నిరంతర నిఘా, గస్తీ నిర్వహించాల్సిన అధికారులు ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ముఖ్యంగా సంబంధిత బీట్ అధికారుల పరిధిలోనే ఈ స్థాయిలో అక్రమ నరికివేత జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు బాధ్యులపై గానీ, విధుల్లో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై గానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి. దీంతో అటవీశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ, పనితీరుపై కూడా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటవీ సంపదను పరిరక్షించాల్సిన శాఖే అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో విఫలమవుతోందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి,అక్రమ వెదురు నరికివేతకు పాల్పడుతున్న వారితో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలనిశ్రీ ప్రజలు,పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే దండంగి నార్త్ జోన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అక్రమ వెదురు తరలింపును పూర్తిగా అరికట్టాలని కోరుతున్నారు.

## బిజినెస్

## మైక్రోసాఫ్ట్‌లో 4,800 మంది ఉద్యోగుల తొలగింపు!




టెక్ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రేసు తీవ్రతరమవుతున్న వేళ ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'మైక్రోసాఫ్ట్' సంచలన నిర్ణయం తీసుకుంది. సంస్థ అంతటా సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు, ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెరుగుతున్న పెట్టుబడులను తట్టుకునేందుకు వీలుగా ఉద్యోగాల కోతకు శ్రీకారం చుట్టింది. తన మొత్తం శ్రామిక శక్తిలో 2.1 శాతం అంటే సుమారు 4,800 మంది ఉద్యోగులను విధుల్లోంచి తొలగిస్తున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది.

**రూ.58 లక్షల కోట్లకు చేరిన ఏఐ ఖర్చులు**

ప్రస్తుత ఏడాది ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాల ఏఐ వ్యయాలు ఏకంగా 700 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.58.8 లక్షల కోట్లు) చేరుకున్నాయి. అయితే, ఈ భారీ పెట్టుబడులకు తగ్గట్టుగా రాబడులను (ఆర్ఓఐ) చూపించాల్సిన ఒత్తిడి కంపెనీలపై తీవ్రంగా ఉంది. మరోవైపు, వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వాడుతుండటంతో మానవ వనరుల అవసరం తగ్గుతోంది. కేవలం మైక్రోసాఫ్ట్ మాత్రమే కాకుండా ఈ ఏడాది అమెజాన్, మెటా ప్లాట్‌ఫామ్స్ వంటి ఇతర బిగ్ టెక్ కంపెనీలు సైతం వేలాది మంది ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే.

### హైదరాబాద్-రియాద్ మధ్య డైరెక్ట్ ఫ్లైట్





హైదరాబాద్, జులై 6: సౌదీ అరేబియాకు చెందిన చౌక విమానయాన సంస్థ ఫ్లైడీల్..దేశీయ విమానయాన రంగంలోకి అడుగుపెట్టింది. తన తొలి సర్వీసును రియాద్ నుంచి డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసును హైదరాబాద్‌కు ప్రారంభించింది. తన తొలి విమాన సర్వీసు జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఉదయం దిగింది. రియాద్‌లో రాత్రి 11.20 గంటలకు బయలుదేరనున్న విమాన సర్వీసు ఆ మరుసటి రోజు హైదరాబాద్‌కు ఉదయం 6.50 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో ఉదయం 7.55 గంటలకు బయలుదేరి 11.05 గంటలకు రియాద్ చేరుకోనున్నది.

# మొబైల్ చార్జీల మోత..!

**త్వరలో 12-15% పెరుగనున్న టారిఫ్‌లు..**

**అన్ని రకాల ప్లాన్లు ప్రియం**

**యూజర్లపై మరింత భారం**




**న్యూఢిల్లీ** : టెలికాం రంగ సంస్థలు మరోసారి చార్జీల మోత మోగించనున్నాయి. త్వరలో మొబైల్ టారిఫ్‌లు మరో 12-15 శాతం పెరిగే వీలుందని తెలుస్తున్నది మరి. ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్)గాను సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రిసెర్చ్ తాజాగా టెలికాం, ఇంటర్నెట్ రంగాలకు సంబంధించి ఓ సమీక్ష నివేదికను విడుదల చేసింది. ఇందులో రాబోయే 3-4 నెలల్లో అన్ని రకాల ప్లాన్ల రీచార్జ్ ధరలు ఎగబాకే అవకాశాలున్నట్టు ఈ బ్రోకరేజీ సంస్థ పేర్కొన్నది. ఇదే జరిగితే వినియోగదారులపై మరింత భారం పడటం ఖాయం.

**అనుకూల వాతావరణం**

ప్రస్తుతం దేశీయ టెలికాం ఇండస్ట్రీలో 4 సంస్థలే ఉన్నాయి. అందులో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ప్రైవేట్ రంగానికి చెందినవైతే, బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగానికి చెందినది. ఒకప్పటితో పోల్చితే భారతీయ టెలికాం సంస్థల సంఖ్య భారీగానే పడిపోయింది. మార్కెట్.. కన్సాలిడేషన్ మోడ్‌లో ఉండటంతో పోటీ వాతావరణం కూడా పెద్దగా లేకుండాపోయింది. ఇదే మొబైల్ టారిఫ్‌ల పెంపునకు దోహదం చేస్తున్నదన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయిప్పుడు. ఇక గతంలో అన్ని రకాల కాలవ్యవధులతో కూడిన ప్లాన్ల రీచార్జ్ రేట్లు తక్కువగానే ఉండేవి. అయితే 2జీ, 3జీ, 4జీ, 5జీ.. ఇలా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తున్నకొద్దీ ధరలు సైతం పెరుగుతున్నాయి.

**స్పెక్ట్రమ్ ఖర్చులతో..**

ప్రస్తుతం దేశంలో 4జీ, 5జీ మొబైల్ వినియోగదారులే ఎక్కువగా ఉండగా.. జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు 90 శాతానికిపైగా జిల్లాల్లో 5జీ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నాయని సెంట్రమ్ చెప్తున్నది. 5జీ కవరేజీ విషయంలో వొడాఫోన్ ఐడియా కూడా వేగం పెంచింది. ఈ నేపథ్యంలో స్పెక్ట్రమ్ (రేడియో తరంగాలు) కోసం ఆయా సంస్థలు భారీగానే ఖర్చు చేయాల్సి వస్తున్నది. దీంతో వాటిని రాబట్టుకోవడానికి చార్జీల పెంపు టెలికాం ఆపరేటర్లకు తప్పనిసరిగా మారుతున్నదని, మార్కెట్‌లో పరిమిత స్థాయిలోనే కంపెనీలుండటం, అన్నీ ఒకే దారిలో వెళ్తుండటంతో వినియోగదారులకూ వేరే మార్గం ఉండటం లేదని విశ్లేషకులు అంటున్నారు. గడిచిన కొన్నేండ్లలో ప్లాన్ల ధరలు దాదాపు 150 శాతం పెరిగాయి.

**ఏఆర్‌పీయూ పైపైకి..**

పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో హైస్పీడ్ ఇంటర్నెట్‌కూ గిరాకీ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీలకు ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 1-1.5 శాతం పెరుగవచ్చని సెంట్రమ్ అంచనా వేస్తున్నది. 5జీ సేవలు అందుబాటులోకి రావడంతో చాలామంది కస్టమర్లు తమ స్మార్ట్‌ఫోన్లనూ ఆ మేరకు అప్‌గ్రేడ్ చేసేసుకుంటున్నారు. దీంతో 4జీతో పోల్చితే ధర ఎక్కువ చెల్లించి 5జీ ప్లాన్లను కొనేస్తున్నారు. ఫలితంగా టెల్కోల ఏఆర్‌పీయూ పెరుగుతూపోతున్నది.

**బీఎస్ఎన్ఎల్ వెనుకంజ..**

జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలతో పోల్చితే బీఎస్ఎన్ఎల్ వెనుకబడిపోతున్నది. నిజానికి ప్రైవేట్ రంగ టెల్కోలతో చూస్తే బీఎస్ఎన్ఎల్ ప్లాన్ల ధరలు చాలా చౌక. కానీ అంతటా నెట్‌వర్క్ లేకపోవడం, ఉన్నా సరిగా పనిచేయకపోవడం.. కస్టమర్లను బీఎస్ఎన్ఎల్ వైపునకు చూడనివ్వడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచీ ఆశించిన స్థాయిలో మద్దతు లేకపోవడంతో స్పెక్ట్రమ్ వేలంలో వెనుకబడిపోవాల్సి వస్తున్నదని, ఇది కంపెనీని ఆర్థికంగా దెబ్బతీస్తున్నదన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థలు 5జీ విస్తరణలో దూసుకుపోతుంటే.. బీఎస్ఎన్ఎల్ మాత్రం 4జీ దగ్గరే తంటాలు పడుతున్నది. ఈ పరిణామం కూడా బీఎస్ఎన్ఎల్ నుంచి కస్టమర్లను ఇతర సంస్థల దిశగా నడిపిస్తున్నది. 'ఎయిర్‌టెల్, జియోలకు కస్టమర్లు క్యూ కడుతున్నారు. వొడాఫోన్ ఐడియాకూ వినియోగదారులు క్రమంగా పెరుగుతున్నారు. జియో 70 లక్షలు, ఎయిర్‌టెల్ 50 లక్షలు, వొడాఫోన్ ఐడియా 2 లక్షల కస్టమర్లను గడిచిన త్రైమాసికంలో పెంచుకోవచ్చని అంచనా' అంటూ సెంట్రమ్ లెక్కలే.. బీఎస్ఎన్ఎల్ దుస్థితికి అద్దం పడుతున్నాయి.

### ఇక సహకార జీవిత బీమా సంస్థ




**న్యూఢిల్లీ:** సహకార రంగంలో జీవిత బీమా కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. బీమా రంగంలో కూడా సహకార సంస్థలు వృద్ధి చెందడానికి ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఎరువులకు సంబంధించిన కోఆపరేటివ్ ఇఫ్కో ఇప్పటికే జాయింట్ వెంచర్ (ఇఫ్కో--టోకియో) ద్వారా బీమా రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని సహకార శాఖ ఐదో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా 26 జీవిత బీమా సంస్థలు ఉన్నాయి. మరోవైపు, కోఆపరేటివ్ మోడల్‌గా ప్రవేశపెట్టిన భారత్ ట్యాక్సీ సేవలను వచ్చే రెండేళ్లలో 500 నగరాలకు విస్తరించనున్నట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ఢిల్లీ, లక్నో, చండీగఢ్, ముంబై తదితర నగరాల్లో ఇవి అందుబాటులో ఉండగా.. త్వరలో రాంచీ, పాట్నా, భోపాల్ మొదలైన నగరాల్లోనూ ప్రవేశపెట్టనున్నట్లు షా చెప్పారు. భారత్‌లో 30 కోట్ల మంది పైగా సభ్యులతో 8.5 లక్షల పైచిలుకు సహకార సంఘాలు ఉన్నాయి. కోఆపరేటివ్ రంగంలో మానవ వనరుల సమస్యను పరిష్కరించేందుకు గుజరాత్‌లోని ఆనంద్‌లో ఏర్పాటు చేస్తున్న త్రిభువన్ సహకారి యూనివర్సిటీ తోడ్పడుతుందని మంత్రి చెప్పారు. బ్యాంకింగ్, డెయిరీ, మార్కెటింగ్ తదితర విభాగాల్లో ఈ వర్సిటీ నిపుణులను తయారు చేస్తుందని వివరించారు.

# హైహై హాలండ్.. బైబై బ్రెజిల్

**ప్రిక్వార్టర్స్‌లోనే ఓడిన ఐదుసార్లు చాంపియన్**

**అర్లింగ్ డబుల్ ధమాకా**

**తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు నార్వే**



ఫిఫా ప్రపంచకప్‌లోనే అతి పెద్ద సంచలనం. అండర్‌డాగ్ నార్వే.. సాకర్‌లో మేటి జట్టు బ్రెజిల్ పని పట్టింది. న్యూజెర్సీ స్టేడియంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన హోరాహోరీ నాకౌట్ పోరులో 2-1 తేడాతో సాంబా టీమ్‌ను చిత్తు చేసింది. నార్వే స్టార్ స్ట్రైకర్ అర్లింగ్ హాలండ్ సెకండాఫ్‌లో (79, 90వ నిమిషాల్లో) రెండు అద్భుత గోల్స్‌తో విరుచుకుపడి మాజీ చాంపియన్లను ఇంటిదారి పట్టించాడు. బ్రెజిల్ దిగ్గజం నెయ్‌మార్ (90ం10వ ని)కొట్టిన ఏకైక గోల్ ఆ జట్టుకు ఓటమి తప్పించలేకపోయింది. సాకర్ చరిత్రలో టాప్ టీమ్స్‌ను పడగొట్టి.. ఎన్నో అద్భుత విజయాలు సాధించిన బ్రెజిల్.. నార్వే కోటను మాత్రం బద్దలు కొట్టలేకపోతోంది. 1988 నుంచి రెండు వరల్డ్‌కప్స్ సహా ఆ జట్టుతో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా నెగ్గలేకపోవడం గమనార్హం. ఇక, తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరిన నార్వే.. ఈ నెల 11న ఇంగ్లండ్‌తో తలపడనుంది.

**సెకండాఫ్‌లో ధమాకా**

ఈ మ్యాచ్ తొలి 45 నిమిషాలు గోల్ లేకుండా ముగిసినప్పటికీ డ్రామాకు ఏమాత్రం కొదవ లేదు. ఆట ఆరంభంలోనే నార్వే ఆటగాడు సాండర్ బెర్గ్ బంతిని నెట్‌లోకి పంపినా.. రిఫరీ ఆఫ్‌సైడ్‌గా ప్రకటించడంతో ఆ టీమ్‌కు నిరాశ ఎదురైంది. ఆ తర్వాత బ్రెజిల్‌కు సువర్ణావకాశం లభించింది. బాక్స్ లోపల మాథ్యూస్ కున్హాను నార్వే డిఫెండర్ క్రిస్టోఫర్ అజెర్ కిందపడేయడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. తన అంతర్జాతీయ కెరీర్‌లో మొదటి పెనాల్టీ కిక్ తీసుకున్న బ్రూనో గిమారెస్ కొట్టిన పేలవ షాట్‌ను నార్వే గోల్‌కీపర్ ఓర్జన్ నైలాండ్ సులభంగా అడ్డుకున్నాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న వినిషియస్ జూనియర్, మార్టిన్ ఒడెగార్డ్ కొట్టిన షాట్లను కూడా తిప్పికొట్టాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ 35 శాతం మాత్రమే బంతిని తన ఆధీనంలో ఉంచుకోగలిగింది. అటు నార్వే బంతినిపై పైచేయి సాధించినా ఫస్టాఫ్‌లో గోల్ కొట్టలేకపోయింది. విరామం తర్వాత బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోటి వ్యూహాత్మకంగా గాబ్రియేల్ మార్టినెల్లి స్థానంలో సీనియర్ స్టార్ నెయ్‌మార్‌ను మైదానంలోకి దించాడు. తన రాకతో బ్రెజిల్ ఎటాకింగ్‌లో వేగం పెరిగినా నార్వే డిఫెన్స్ గట్టిగా నిలబడింది. ఇంకోవైపు నార్వే ఫార్వర్డ్స్ బ్రెజిల్ డిఫెన్స్‌లోకి చొచ్చుకెళ్లి దాడుల తీవ్ర పెంచారు. ఈ క్రమంలో ఆండ్రియాస్ షెల్డెరప్ ఎడమ వైపు నుంచి అందించిన అద్భుతమైన క్రాస్‌ను అందుకున్న హాలండ్ బ్రెజిల్ డిఫెండర్ గాబ్రియేల్ కంటే ఎత్తుగా ఎగిరి బుల్లెట్ లాంటి హెడర్ గోల్ కొట్టాడు. అక్కడి నుంచి బ్రెజిల్ స్కోరు చేసేందుకు ఎంత ట్రై చేసినా .. నిర్ణీత 90 నిమిషాల్లో నార్వే డిఫెన్స్‌ను బ్రేక్ చేయలేకపోయింది. ఇంకోవైపు ఇంజూరీ టైమ్‌లో షెల్డెరప్ ఇచ్చిన పాస్‌ను హాలండ్ క్లాసిక్ టచ్‌తో గోల్ పోస్ట్ రైట్ కార్నర్‌లోకి పంపి నార్వే ఆధిక్యాన్ని డబుల్ చేశాడు. అప్పటికే బ్రెజిల్ ఆటగాళ్లు, ఫ్యాన్స్ తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. మ్యాచ్ ఆఖరి క్షణాల్లో బ్రెజిల్‌కు మరో పెనాల్టీ లభించింది. దాన్ని నెయ్‌మార్ గోల్‌గా మలిచినా అప్పటికే పూడ్చలేని నష్టం జరిగిపోయింది.

**కప్పు లేకుండానే కథ ముగిసె**

మెగా టోర్నీలో అనూహ్య ఓటమి తర్వాత బ్రెజిల్ సూపర్ స్టార్ నెయ్‌మార్ జూనియర్ తన ఇంటర్నేషనల్ కెరీర్‌కు వీడ్కోలు ప్రకటించడం ఆ జట్టు అభిమానుల బాధను రెట్టింపు చేసింది. 2010లో అమెరికా గడ్డపైనే యూఎస్ఏ జట్టుతో ఫ్రెండ్లీ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన దిగ్గజం అదే దేశంలో తన ఆట ముగించాడు. 'వరల్డ్‌కప్ నెగ్గాలన్నది నా కల. దాని కోసంచాలా ప్రయత్నించాను. ఇప్పుడు నా పోరాటం ముగిసింది. ఇక్కడే కెరీర్ ఆరంభించాను.. ఇక్కడే ముగిస్తున్నా' అని నెయ్‌మార్ మ్యాచ్ తర్వాత భావోద్వేగంతో చెప్పాడు. తన 16 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో నెయ్‌మార్ ఈ తరం మేటి ఆటగాళ్లలో ఒకడిగా, బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. మైదానంలో మెరుపు వేగంతో కదులుతూ అనుకోని దిశల్లోకి టర్న్ అవుతూ ప్రత్యర్థులను ఆశ్చర్యపరచడం.. బంతిని తన కాలికి అతుక్కున్నట్లుగా డ్రిబ్లింగ్ చేయడం, డిఫెండర్లను ఏమార్చి ముందుకు వెళ్లడంలో అతను దిట్ట. బంతిని పైకి లేపి, డిఫెండర్ల తల మీదుగా పంపే రెయిన్‌బో ఫ్లిక్ వంటి నైపుణ్యాలతో ఎంతో మంది ఫ్యాన్స్‌ను సంపాదించుకున్నాడు.

జాతీయ జట్టు తరఫున 130 మ్యాచ్‌లు ఆడిన అతను 80 గోల్స్ కొట్టి మరో 59 అసిస్టులు చేశాడు. కెప్టెన్‌గా బ్రెజిల్‌కు 2013 ఫిఫా కన్ఫెడరేషన్స్ కప్ అందించిన అతను 2016 రియో ఒలింపిక్స్‌లో సొంతగడ్డపై జట్టుకు స్వర్ణం సాధించిపెట్టాడు. కానీ, వరల్డ్ కప్ కలను నెరవేర్చుకోలేకపోయాడు. అతని కెరీర్‌ను గాయాలు వెంటాడాయి. ఈ కారణంగానే తన ప్రతిభకు నెయ్‌మార్ సంపూర్ణ న్యాయం చేయలేకపోయాడు. లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో అంత టాలెంట్ ఉన్నా.. ఈ ఇద్దరి మాదిరి సక్సెస్‌ను అందుకోలేకపోయాడు. కొన్నిసార్లు బ్రెజిల్ అతనిపై అతిగా అంచనాలు, భారం మోపి దెబ్బతిన్నది. 2014 సొంతగడ్డపై వరల్డ్‌కప్‌లో తొలి నాలుగు మ్యాచ్‌ల్లో ఐదు గోల్స్ కొట్టిన తర్వాత నెయ్‌మార్ క్వార్టర్ ఫైనల్లో గాయపడి స్ట్రెచర్‌పై బయటికి వెళ్లడం.. తను లేకుండా సెమీస్ ఆడిన బ్రెజిల్ 1-7తో జర్మనీ చేతిలో చిత్తవడం సాంబా అభిమానులకు ఇప్పటికీ చేదు జ్ఞాపకాలే. మొత్తంగా దశాబ్ద కాలంగా బ్రెజిల్ బలం.. బలహీనత అయిన నెయ్‌మార్ ఇప్పుడు పూర్తిగా దూరమైన తర్వాత ఆ జట్టు ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి.

ఫిఫా ప్రపంచకప్‌లో బ్రెజిల్ జట్టు 1990 తర్వాత క్వార్టర్స్‌కు ముందే ఇంటిదారి పట్టడం ఇదే తొలిసారి.

2002 ఫైనల్లో జర్మనీని ఓడించి ట్రోఫీ నెగ్గిన తర్వాత ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో బ్రెజిల్ యూరోపియన్ ప్రత్యర్థుల చేతిలో ఓడిపోవడం ఇది ఏడోసారి.

వరల్డ్ కప్‌లో బ్రెజిల్‌ను నార్వే ఓడించడం ఇది రెండోసారి. 1998 ఎడిషన్‌లో 2-1తో గెలిచింది. మరో మూడు ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల్లో ఓసారి గెలిచి రెండింటిని డ్రా చేసుకుని అజేయంగా నిలిచింది.

ఈ వరల్డ్‌కప్‌లో నార్వే స్టార్ హాలండ్‌కు ఇది 6వ గోల్. తన తొలి నాలుగు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లోనూ వరుసగా గోల్స్ సాధించిన 8వ యూరోపియన్ ఆటగాడిగా అతడు రికార్డు సృష్టించాడు.

## స్పోర్ట్స్

### ఇంగ్లండ్ తగ్గేదేలే..



మెక్సికో సిటీ: వరల్డ్ కప్ ఫేవరేట్‌లలో ఒకటైన ఇంగ్లండ్ సైతం క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మెక్సికో అభిమానులు స్టేడియానికి పోటెత్తగా ఆసాం తం నువ్వానేనా అన్నట్టుగా సాగిన ప్రిక్వార్టర్స్‌లో హ్యారీ కేన్ సేన 3-2తో ఆతిథ్య జట్టును ఓడించి టోర్నీలో తదుపరి దశకు ముందంజ వేసింది. మ్యాచ్ ముందు రోజు రాత్రి మెక్సికో అభిమానులు ఇంగ్లిష్ ఆటగాళ్ల నిద్ర, ఏకాగ్రతను దెబ్బతీసేందుకు ఇంగ్లండ్ బస చేస్తున్న హోటల్ ముందుకు వచ్చి డ్రమ్స్, బాణాసంచాతో భారీ శబ్దాలు చేశారు. కానీ మ్యాచ్‌లో ఇంగ్లండ్ మాత్రం గోల్స్‌తో వారికి దీటైన సమాధానమిచ్చింది. ఇంగ్లిష్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హమ్ (36వ, 38వ నిమిషం లో) 98 సెకన్ల వ్యవధిలో రెండు గోల్స్ చేయగా ఆ జట్టు సారథి హ్యారీ కేన్ (60వ) ఓ గోల్ కొట్టాడు. ఈ టోర్నీలో కేన్‌కు ఇది ఆరో గోల్ కాగా వరల్డ్ కప్స్‌లో 14వది కావడం విశేషం. మెక్సికో తరఫున జులియన్ క్వినోన్స్ (42వ), జిమెనెజ్ (69వ) తలా ఓ గోల్ చేశారు.

### క్యాడీ క్లాష్ గోల్ఫ్ విన్నర్ ప్రేమ్



**హైదరాబాద్,** ఆట ప్రతినిధి: టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహించిన 4వ ఎడిషన్ క్యాడీ క్లాష్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో ప్రేమ్, మహమూద్ సత్తా చాటారు. గోల్ఫ్ ఆటలో కీలక పాత్ర పోషిస్తూ తెరవెనుక ఉంటున్న క్యాడీల ప్రతిభను గుర్తించేందుకు నిర్వహించిన ఈ ఈవెంట్‌లో హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్, బౌల్డర్ హిల్స్, బెప్టా , హల్దీ వంటి ప్రముఖ క్లబ్‌ల నుంచి 140 మందికి పైగా క్యాడీలు వివిధ విభాగాల్లో పోటీ పడ్డారు. సోమవారం ముగిసిన టోర్నీలో బెప్టాకు చెందిన ప్రేమ్ (75 పాయింట్లు) గ్రాస్ విజేతగా , హెచ్‌జీఏకు చెందిన మహమూద్ రన్నరప్‌గా నిలిచారు. షా ఫైసల్, మేఘనాథ్ హ్యాండిక్యాప్ కేటగిరీల్లో టాప్ ప్లేస్ సొంతం చేసుకోగా.. క్లోజెస్ట్ టు ది పిన్ అవార్డును జి. మహేష్ సాధించాడు. విజేతలకు టిగోల్ఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్ఆర్ఎన్ రెడ్డి, ఎమార్ ఇండియా బిజినెస్ హెడ్ మధుసూదన్ రావు అవార్డులు అందించారు



# కష్టాల్లో కాపాడేవాడే నిజమైన రాజు'.. ట్రైలర్ రిలీజ్

రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా వస్తోన్న లేటేస్ట్ మూవీ రాజా ది రాజా. ఈ చిత్రానికి అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌లో దాసరి నిహారిక నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్.


ఈ ట్రైలర్ చూస్తుంటే రాజు అనే కాన్సెప్ట్ ప్రధానంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. రాజుల కాలానికి.. ప్రజెంట్‌కు లింక్ పెట్టి ఈ కథను రూపొందించినట్లు ట్రైలర్‌లో కనిపిస్తోంది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఈ కథలో ఉండనున్నాయని ట్రైలర్‌లో చూపించారు. ఈ సినిమాకు మార్క్ కె రాబిన్ సంగీతమందించారు. ఈ మూవీలో సాయి కుమార్, నరేశ్, అవసరాల శ్రీనివాస్, విష్ణు, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, భద్రం, మైమ్ మధు, ఆనంద్ కీలక పాత్రల్లో నటించారు. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ మీరు కూడా చూసేయండి.

# అఖిల్‌పై ఆ భయం ఉండేది.. 'లెనిన్' చూసి ఆశ్చర్యపోయా : నాగార్జున



"లెనిన్' రాయలసీమ కథ. సింపుల్‌గా చెప్పాలంటే సీమలో జరుగుతున్న మహాభారతం. ఈ సినిమాకు ముందు అఖిల్ ఎక్కువగా అర్బన్ ఫిల్మ్స్ చేశాడు. మరి... ఈ సినిమాకి సూట్ అవుతాడా? అని ముందు నాకు భయంగా ఉండేది. కానీ సినిమా చూశాక, నేను కాదు... అందరూ ఆశ్చర్యపోయారు. 'లెనిన్' రోల్‌లోకి అఖిల్ వెళ్లిపోయాడు. సినిమా చూసిన తర్వాత లెనిన్ స్నేహాన్ని, ప్రేమను, పగని కూడా ప్రేమిస్తారు. లెనిన్ ను మీరు ఇంటికి తీసుకెళ్లిపోతారు. మీకు అఖిల్ కనపడడు... 'లెనిన్ ' కనిపిస్తాడు" అని నాగార్జున అన్నారు. అఖిల్, భాగ్యశ్రీ భోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లెనిన్ '. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మురళీ కిషోర్ అబ్బూరు (నందు) దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఆదివారం తిరుపతిలో జరిగిన 'లెనిన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున మాట్లాడుతూ-- "ప్రేమ కోసం యుద్ధాలు జరిగాయి. ప్రేమకోసం రాజ్యాలు కూలిపోయాయి. 'లెనిన్'లో కూడా ఒక ప్రేమకథ ఉంది. నందు ఈ సినిమా కథ చెప్పడానికి వచ్చినప్పుడు ఇది శ్రీరామపురంలో జరిగే కథ అన్నాడు. 'శ్రీరామపురం' అంటే మా నాన్నగారు పుట్టిన ఊరు (కృష్ణా జిల్లా). అయితే ఈ శ్రీరామపురం చిత్తూరు జిల్లాలో అని చెప్పాడు. కానీ శ్రీరామపురం అంటే నాకో సెంటిమెంట్. దీంతో నందును కథ చెప్పమన్నాను. నందు కథ చెప్పడం మొదలు పెట్టాడు. ఇందులో పాత్రలు డిఫరెంట్‌గా అనిపించాయి. 'లెనిన్' సెకండాఫ్‌లోని ట్విస్ట్‌లను ప్రేక్షకులు ఊహించలేరు. మా పార్ట్‌నర్ నాగవంశీకి ఈ సినిమాపై ఎంత కాన్ఫిడెన్స్ అంటే... ఏపీ అంతా అతనే డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. మన అందరికీ దేవుడు ఆ వెంకటేశ్వరస్వామి. నాన్నగారు ఎప్పుడూ అంటుంటారు ఆయనకు దేవుడు మాత్రం ప్రేక్షక దేవుళ్ళు అని. సో... ఈ ప్రేక్షక దేవుళ్లకు చెబుతున్నాను. జూలై 10న వస్తున్నాం. మనవాడు కొడుతున్నాడు" అని అన్నారు. అఖిల్ మాట్లాడుతూ-- "లెనిన్'ఉద్దేశం ఒకటే. నేను మీ ఇంటివాడినైపోవాలి. మీ సీమ బిడ్డ మురళీకిశోర్ రెండేళ్ల క్రితం ఈ సినిమా కథ చెప్పారు. నేను చేయాలనుకున్న కథ ఇదే అనిపించింది" అన్నారు. "ఈ మూవీలో భారతి అనే పాత్ర చేశాను. ఈ సినిమా నా కెరీర్‌లో చాలా స్పెషల్" అన్నారు భాగ్యశ్రీ బోర్సే. "నాగేశ్వరరావుగారి మనవడు, నాగార్జునగారి అబ్బాయి అఖిల్ గోల్డెన్ స్పూన్ తో పుట్టాడు. పెద్ద కష్టపడలేదని అంటుంటారు. కానీ సోల్ ఆఫ్ లెనిన్ వచ్చినప్పట్నుంచి 'అఖిల్ ఫస్ట్ టైమ్ కష్టపడుతున్నట్లు కనిపిస్తుంది కదరా' అనేవాళ్లు. ఈ అభిప్రాయాన్ని జనాల్లోకి తీసుకుని వెళ్లేందుకు అఖిల్‌గారు ఎంత కష్టపడ్డారో మేం చూశాం. ఇది రెగ్యులర్ మాస్ మూవీ కాదు. రెండు మూడు చోట్ల ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. అలాంటి స్క్రీన్‌ప్లే రాశాడు నందు" అన్నారు నాగవంశీ. బ్రహ్మాజీ, సునీల్ మాట్లాడారు.

## ఫుల్ స్పీడ్‌లో రవితేజ.. 'ఇరుముడి' రిలీజ్‌కు ముందే కొత్త సినిమా, శ్రీవిష్ణుతో మల్టీస్టారర్?



మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. వీశీజఱవం హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

## అఖిల్ అక్కినేని 'లెనిన్' లో తారక్ రోల్ ఏంటీ.. హైప్ పెంచేస్తున్న నయా పోస్టర్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని తెలిసిందే. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ లాంచ్ చేసిన కొత్తపోస్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఈ మూవీలో జూనియర్ ఎన్టీఆర్ కూడా భాగం కాబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. అదెలా అంటే తాజా పోస్టర్‌లో టైగర్ లుక్‌తో పాటు లెనిన్ టైటిల్ లోగోను చూడొచ్చు. ఇంతకీ ఈ కొత్త పోస్టర్ వెనుకున్న సీక్రెట్ ఏంటంటే.. ఈ చిత్రానికి యంగ్ టైగర్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ అందించడమే కాకుండా సినిమా కథనాన్ని వివరించబోతున్నాడట. ఈ పోస్టర్‌తో సినిమాలో తారక్ రోల్ ఏంటనేది క్లారిటీ ఇచ్చేసినట్టేనని అర్థమవుతోంది. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు.



## ఓటీటీలోకి వచ్చి రెండు రోజుల్లోనే మాయమైన 'సత్లుజ్'.. ఈ సినిమా వెనుక ఇంత పెద్ద కథ ఉందా?




సాధారణంగా ఒక సినిమా విడుదలకు ముందు ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటుంది. సెన్సార్ సమస్యలు, కోర్టు కేసులు, ఆర్థిక ఇబ్బందులు, టైటిల్ వివాదాలు వంటి కారణాలతో సినిమాలు వాయిదా పడటం కొత్త విషయం కాదు. అయితే ఓటీటీలో విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే స్ట్రీమింగ్‌ను నిలిపివేయడం మాత్రం అరుదుగా జరిగే పరిణామం. ఇప్పుడు పంజాబీ స్టార్ నటుడు, గాయకుడు దిల్జిత్ దొసాంజే ప్రధాన పాత్రలో నటించిన 'సత్లుజ్' సినిమా ఇదే కారణంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పంజాబ్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. 1990లలో పంజాబ్‌లో అదృశ్యమైన పలువురు వ్యక్తుల కేసులను పరిశోధించి కీలక ఆధారాలను వెలికితీసిన ఖల్రా, అనంతరం 1995లో హత్యకు గురయ్యారు. ఆయన జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారంగా తీసుకుని దర్శకుడు హనీ ట్రెహన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. మొదట ఈ సినిమాకు 'ఘల్లుఘరా' అనే టైటిల్ ప్రకటించారు. అనంతరం దాన్ని 'పంజాబ్ 95'గా మార్చగా, చివరికి ఓటీటీ విడుదల సమయంలో 'సత్లుజ్' పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమా 2022లోనే పూర్తయినప్పటికీ విడుదల మాత్రం సాధ్యం కాలేదు. కారణం సెన్సార్ వివాదాలు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) మొదట కొన్ని హింసాత్మక సన్నివేశాలు, సంభాషణలు, టైటిల్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ 21 మార్పులు సూచించింది. నిర్మాతలు ఆ మార్పులు చేసిన తర్వాత మళ్లీ సెన్సార్‌కు వెళ్లగా, ఈసారి ఏకంగా 127 కట్స్ సూచించినట్లు సమాచారం. అంతటి మార్పులు చేస్తే సినిమా అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని భావించిన చిత్రబృందం కోర్టును ఆశ్రయించింది. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యమైంది. థియేటర్లలో విడుదలకు మార్గం సుగమం కాకపోవడంతో, చిత్రబృందం ఎలాంటి హడావుడి లేకుండా జూలై 3న జీ5 (జుజు5) ఓటీటీ వేదికగా 'సత్లుజ్'ను విడుదల చేసింది. ఈ సందర్భంగా హీరో దిల్జిత్ దొసాంజే స్పందిస్తూ.. ఓటీటీలో విడుదలైనది పూర్తిస్థాయి ఒరిజినల్ వెర్షనేనని, ఒకవేళ కట్స్ చేసి విడుదల చేసి ఉంటే తాను ఆ సినిమాను ప్రమోట్ కూడా చేసేవాడిని కాదని స్పష్టం చేశారు. అయితే విడుదలైన రెండు రోజులకే భారతదేశంలో జీ5 ప్లాట్‌ఫామ్ నుంచి సినిమా కనిపించకుండా పోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దీనిపై స్పందించిన జీ5 యాజమాన్యం.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సినిమాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, చట్టపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశం ఉందని తెలిపింది. అయితే సినిమా తొలగింపుకు అసలు కారణం ఏమిటన్న విషయాన్ని మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. దీంతో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు మొదలయ్యాయి.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,